J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 23 07.11.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




## నింగికెగసిన ఎల్‌వీఎం3-ఎం5

..12లో

### కూటమి నేతలపై

# తిరుగుబాటు చేస్తున్న త్రిబుల్ ఆర్

- తీరుమారని రఘురామ కృష్ణంరాజు
- స్వపక్షానికి కంటిలో నలుసులా మారారు
- వైసీపీలో ఉన్నప్పుడు కూడా ఇదే ధోరణి



**ఇదేమి గోల రఘురామా?**

"శత్రువులెక్కడో ఉండరు, అయినవారి రూపంలో మనమధ్యే తిరుగుతూ ఉంటారు". 'అ..ఆ' అనే సినిమాలోని పాపులర్ డైలాగు ఇది. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజు రాజకీయాల్లో దీన్ని నిజం చేస్తున్నారు. అయినదానికి కానిదానికి అనవసరంగా స్పందిస్తూ అటు కూటమి ప్రభుత్వంలోనూ, ఇటు ప్రజల్లోనూ పలుచనవుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయన తన స్థాయిని మరిచి జనసేన, టీడీపీ , బీజేపీ పార్టీలు కలిసి పోటీ చేసేందుకు తానే కారణమని, తాను లేకుంటే అసలు కూటమి ఏర్పడేదే కాదని అంతర్గతంగా ఆంతరంగిక చిట్ చాట్‌లో చెప్పుకుంటున్నట్లు కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో అటు తెలుగుదేశం నేతలు, ఇటు జనసేన, బీజేపీ నేతలు ఆయన తీరుపై గుర్రుగా ఉన్నట్లు సమాచారం. చచ్చీచెడి చివరి నిమిషంలో ఉండి నియోజకవర్గ టికెట్ తెప్పించుకుని, గెలిచాక డిప్యూటీ స్పీకర్ పదవి చేపట్టినా ఆయనలో అసంతృప్తి మాత్రం అలాగే ఉండిపోయిందని, అమాత్య యోగం దక్కలేదనే కోపంతోనే ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ కూటమిలో కుంపట్లకు కారణమవుతున్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. 2లో

## శుభాభినందనలు



కాలేయ మార్పిడి (Liver Transplantation) శస్త్ర చికిత్స విభాగంలో అత్యున్నత సేవలందిస్తూ,
దక్షిణ భారతదేశంలోనే అత్యుత్తమ వైద్యనిపుణుడిగా
తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి గారి చేతులమీదుగా ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్న
డాక్టర్ పచ్చా రజనీకాంత్, గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్, చెన్నై గారికి
శుభాభినందనలు.

డాక్టర్ కే.కృష్ణకిషోర్ - వాసంతి
డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థలు
ఆంధ్రప్రదేశ్.

# త్రిబుల్ ఆర్

(మొదటిపేజీ తరువాయి)

## ఎంపీగా ఉన్నప్పుడూ...

## ఇదే తరహా వ్యవహార శైలితో!

2019 ఎన్నికల్లో నర్సాపురం ఎంపీగా వైఎస్సార్ సీపీ తరపున రఘురామ కృష్ణరాజు ఎన్నికయ్యారు. అయితే ఆ తర్వాత ఏడాది కాలానికే జగన్‌తో విబేధాలు తీవ్రమై పార్టీలో అసంతృప్త నేతగా ముద్ర పడ్డారు. ఈక్రమంలో జగన్ తీరును విమర్శిస్తూ ప్రతిపక్షం కంటే తీవ్రంగా విరుచుకుపడ్డారు. కొన్నేళ్లపాటూ రచ్చబండ పేరుతో ఢిల్లీలో ఉంటూ రోజూ మీడియా సమావేశాలు నిర్వహించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే క్రమంలో దేశద్రోహం, రాజద్రోహం కేసులు నమోదవడంతో జైలుకు కూడా వెళ్లారు. ఆ సమయంలో జగన్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి పోలీసులతో చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని వాపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ విషయంపై ఫిర్యాదు కూడా చేశారు. ఇందంతా నాణేనికి ఒకవైపు అనుకుంటే మరోవైపు వైఎస్సార్ సీపీ ఎంపీగా కొనసాగుతూనే, జగన్ తమ నాయకుడంటూనే ఆ పార్టీ అధిష్టానాన్ని ముప్పుతిప్పలుపెట్టి మూడు చెరువులు నీళ్లు తాగించారు. ఈ క్రమంలో ఏకంగా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌తో పాటూ ఆయన ప్రభుత్వంపైన కోర్టులో కేసులు కూడా వేశారు. జగన్ బెయిల్ రద్దు చేయాలంటూ పిటిషన్లు కూడా దాఖలు చేశారు. అవి అప్పట్లో సంచలనం కలిగించాయి. జగన్ సొంత పార్టీ పెట్టిన కొత్తల్లోనే ఆ పార్టీలో చేరి జగన్‌ని అపరిచితుడు అని విమర్శించిన తొలినేత కూడా రఘురామ కృష్ణరాజే. ఓ లోక్‌సభ సభ్యుడు తమ సొంత పార్టీ అధినేత, అదీ ఏకంగా ముఖ్యమంత్రిపైనే కేంద్రానికి ఫిర్యాదు చేయడం అప్పట్లో దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈక్రమంలో ఐదేళ్లు ఎన్నో డెక్కాముక్కీలు తిని చివరికి 2024 ఎన్నికల నాటికి చంద్రబాబు శరణుకోరి టీడీపీలోకి వచ్చారు. తర్వాత ఉండి నుంచి ఎమ్మెల్యేగా శాసనసభకు ఎన్నికయ్యారు.

## కూటమి పార్టీలతోనూ కుస్తీ...!

తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతాపార్టీ కూటమి బంపర్ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ కృష్ణరాజు నియమితులయ్యారు. అయితే జిహ్వాచాపల్యం, నియంత్రణ లేని మనస్తత్వానికి ప్రతీక అయిన రఘురామ కృష్ణరాజు తరచూ జనసేత అధినేత పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గతంలో శాసనసభలో చర్చ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధించే బాధ్యత అందరి సభ్యులకంటే ఎక్కువగా పవన్ కల్యాణ్‌పైనే ఉందని, ఆయన తమ సినీ స్టార్‌డమ్‌ను ఉపయోగించి తక్షణం రాష్ట్రంలో ప్లాస్టిక్, కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ అనూహ్య సూచనతో ఇరకాటంలో పడిన పవన్ ఎటూ చెప్పలేక మిన్నకుండిపోయారనే విమర్శలున్నాయి. తర్వాతకాలంలో మెగాస్టార్ చిరంజీవి గురించి బాలకృష్ణ తీవ్రస్థాయిలో విమర్శించినా స్పీకర్ స్థానంలో కూర్చున్న రాఘురామకృష్ణరాజు వారించకపోవడం కూటమిలో చిచ్చుకు కారణమైంది. కనీసం బాలకృష్ణ మాటలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు కూడా ప్రకటించకపోవడంతో రఘురామ కృష్ణరాజుపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా, భీమవరం సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతలు క్షీణించడం, పేకాట క్లబ్‌లు పెరిగిపోవడం, సెటిల్‌మెంట్లు, పంచాయితీలకు పోలీస్‌స్టేషన్లు కేంద్రంగా మారాయని, అసాంఘిక కార్యకలాపాలు విస్తృతమయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ విషయంపై (స్థానిక డీఎస్పీ జయసూర్య తీరుపై) సమగ్ర నివేదిక అందజేయాలని ఆ జిల్లా ఎస్పీని డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ ఆదేశించారు. అయితే, దీనిపై ప్రెస్‌మీట్ పెట్టి మరీ "డీఎస్పీ సూర్య మంచివారని, ఎవరో పవన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారని, తన నియోజకవర్గ పరిధిలో పనిచేసే అధికారి గురించి తనకు తెలియదా..?" అంటూ త్రిబుల్ ఆర్ వాఖ్యానించారు. జనసేన పార్టీకి చెందిన మాజీమంత్రి, ప్రస్తుత కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఈ సంఘటన పై అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఓ విషయం పైన పవన్ జిల్లా ఎస్పీని నివేదిక అడిగితే రఘురామ కృష్ణరాజు స్పందించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్‌కు చెందిన శాఖకాకున్నా, రాష్ట్రంలో ఏ విషయంపై అయినా సమాచారం తెప్పించుకునే హక్కు, అధికారం తమ అధినేతకు ఉందని, ఈ విషయంలో అవాకులు చెవాకులు పేలితే సహించబోమని మండిపడ్డారు. ఇక సోషల్ మీడియాలో జనసైనికులు విగ్గురాజుకి మతి భ్రమించిందని, పోనీ అని ఎమ్మెల్యేగా గెలిపిస్తే తమ అధినేతపైనే మాట్లాడుతున్నారని, జగన్ పార్టీలా తాము రఘురామ కృష్ణరాజును ఉపేక్షించే ప్రసక్తే లేదంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నష్టనివారణ కోసం తాను డీఎస్పీ సూర్య వ్యవహారంలో యథాలాపంగా స్పందించానని రఘురామ చెప్పుకున్నా,అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

## బీజేపీ నేతలతోనూ కయ్యం!

ఇక 2024 ఎన్నికల్లో తన నర్సాపురం ఎంపీ స్థానానికి ఎసరు పెట్టిన బీజేపీ ఎంపీ, ప్రస్తుత కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మపై కూడా నియోజకవర్గ స్థాయిలో రఘురామ కృష్ణరాజు మాటలు తూటాలు పేల్చడం వివాదాస్పదంగా మారింది. నిజానికి శ్రీనివాస వర్మకు పొత్తులో భాగంగా ఎంపీ సీటు కేటాయించగానే , ఆయనకి అంత స్థాయి లేదంటూ అప్లట్లో సిట్టింగ్ ఎంపీగా ఉన్న రఘురామ వ్యాఖ్యానించడం విమర్శలకు తావిచ్చింది. అయితే శ్రీనివాస వర్మ నర్సాపురం నుంచి గెలవడం, తర్వాత కేంద్ర మంత్రిగానూ అవకాశం రావడంతో కొన్నాళ్లూ రఘురామ కృష్ణరాజు సైలెంట్ అయ్యారు.

అయితే, తర్వాత తన సహజ శైలిలో స్థానికంగా ఉంటూనే కేంద్రసహాయ మంత్రిపై విమర్శలు చేయడం, అభివృద్ధి పనుల్లో శ్రీనివాసవర్మ కంటే తన ప్రాధాన్యమే అధికమని చెప్పుకోవడం వంటివి చేస్తూ కూటమిలో కుంపట్లు రాజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో మరోసారి స్వపక్షంలో విపక్షం పాత్రను పోషిస్తూ కూటమిలో చిచ్చు రగిలిస్తున్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక పొలిటికల్ విషయాలను పక్కన పెడితే తన పరిశ్రమల కోసం బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని వాటిని ఎగవేశారనే ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయనేది అందరికీ తెలిసిందే. ఇక ఉండిలోనూ అధికారులతో తగవులు, కూటమి నేతలతో విబేధాలు రఘురామ కృష్ణరాజును రచ్చకీడుస్తున్నాయన్నది విశ్లేషకుల భావన. ఈ నేపథ్యంలో ఆంధ్రా పొలిటికల్ సర్కిల్‌లో ఆర్‌ఆర్‌ఆర్‌గా గుర్తింపు పొందిన రఘురామ కృష్ణరాజు ఇప్పటికైనా తన తీరు మార్చుకుని రాజకీయాల్లో రాణిస్తారో..? లేక వివాదాస్పద నేతగా మిగిలిపోతారో కాలమే నిర్ణయించనుంది. ఇక తనపై ఎన్ని విమర్శలు వచ్చినా ఆర్‌ఆర్‌ఆర్ అంటే "రచ్చో.. రచ్చస్య.. రచ్చోభ్యహః" అన్న రీతిలో రాఘురామ కృష్ణరాజు దూసుకెళ్తుండడం గమనార్హం!

---

గల్పిక

# కృష్ణుడు లేని భారతం... మోదీ లేని ఏపీ రాజకీయం!

ఆంధ్రప్రదేశ్ ప్రజల కర్మవశాత్తు... గతంలో ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్ జగన్మోహనరెడ్డి, ప్రస్తుతం పని చేస్తున్న చంద్రబాబునాయుడు... రానున్న ఎన్నికల 'కురుక్షేత్రం'లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "సాయం" తీసుకోడానికి... ఇద్దరూ ఒక్కసారే ద్వారకా నగరం లాంటి ఢిల్లీ వెళ్లారు.

ఇద్దరూ వస్తున్నారని మోదీజీకి చెవిలో అమిత్ షా చెప్పారు. మోదీజీ వెంటనే, తన డ్రాయింగ్‌రూమ్‌లో కుర్చీలు, సోఫాలు తీయించేసి... ఒక్క దివాన్ మాత్రమే ఉంచారు. దాని తల వైపు ఒక కుర్చీ, కాళ్ళ వైపు ఒక కుర్చీ ఉంచి మెల్లగా నిద్రా భంగిమలో మోదీజీ పడుకున్నారు.

చంద్రబాబు... ఒక పెద్ద గంధపు చెక్కతో చేసిన వెంకటేశ్వరస్వామి వారి ప్రతిమ... కల్తీ లేని స్వచ్ఛమైన జెర్సీ ఆవు నెయ్యితో చేయించిన లడ్డు ప్రసాదం తీసుకుని... మోదీజీ 'నిద్రిస్తున్న' హాల్‌లోకి.. వీలైనంత వినయంగా... పొందికగా ప్రవేశించారు. మోదీజీ నిద్రిస్తున్నారు.

అప్పటికే అక్కడ జగన్ – మోదీజీ తలవైపు కూర్చుని... మోదీజీ ఎప్పుడు నిద్ర లేస్తారా అని అసహనంగా అటూ ఇటూ కుర్చీలో కదులుతూ కాలక్షేపం కోసం పబ్జీ ఆడుకుంటున్నారు.

జగన్‌ను చూడగానే చంద్రన్నకు చిర్రెత్తుకు వచ్చింది. "నిన్ను అరెస్ట్ చేయించడం లేదని ఇప్పటికే నాకు బోల్డంత బ్యాడ్ నేమ్ వచ్చింది. అయినా నేను వస్తే, కనీసం విష్ చేయవా?" అనుకుంటూ చంద్రన్న మనసులోనే నొచ్చుకుంటూ... మోదీజీకి నిద్రాభంగం కలిగించడం ఇష్టం లేక ఆయన కాళ్ళ వైపు ఉన్న కుర్చీలో మెల్లగా కూర్చున్నారు.

మోదీజీ నిద్రలోంచి మేల్కొని... కళ్ళు తెరిచీ తెరవగానే, ఆయనకు కనిపించాలనే భావనతో ఆ కుర్చీలో కూర్చున్నారు. చంద్రన్నకు పని ముఖ్యం. పద్ధతి కాదు.

అక్కడ కూర్చున్నారన్న మాటే గానీ, చంద్రన్న మనసంతా... 2047కి ఆంధ్ర ప్రదేశ్‌ను ప్రపంచంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎలా తీర్చిదిద్దాలి... కొత్త పెట్టుబడుల కోసం ఏయే దేశాలకు వెళ్ళాలి.. రానున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విప్లవాన్ని ఎలా అందిపుచ్చుకోవాలి... ఇంకా ఏయే వర్గాల ఓటర్ల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి.. అనే ఆలోచనలతో... చంద్రన్న మనసంతా చిక్కురొక్కురుగా, గజిబిజిగా తయారైంది. మోదీజీ వంక ఓసారి తేరిపార చూశారు. ప్రశాంత వదనంతో నిద్రిస్తున్నట్టుగా మోదీజీ కనిపించారు.

"మహానుభావుడు. ఆయన దయే లేకపోతే... నేను ఎక్కడ ఉండేవాడినో..." అనుకుంటూ, మనసులోనే మోదీజీకి చంద్రన్న కృతజ్ఞతాభివందనాలు అర్పించుకున్నారు.

తలవైపు కూర్చున్న జగన్ కూడా మోదీజీ మోమునే చూస్తున్నారు. "మీ ఆశీస్సులు లేకపోతే నేనేమైపోయేవాడినో?" అనుకుంటూ జగన్ లోలోపల సంబరపడిపోతున్నారు.

తన గురించి చంద్రన్న, జగన్ మనసుల్లో ఏమీ అనుకుంటున్నదీ మోదీజీ దివ్య దృష్టితో చూశారు, విన్నారు. వీరిద్దరూ ఎక్కడెక్కడ కూర్చున్నదీ కూడా.. గమనించారు. సన్నని చిరునవ్వు ఆయన పెదాలపై ఒక్క క్షణం మెరిసింది. మెల్లగా కళ్ళు తెరిచారు.

ఆ మహత్తర క్షణం కోసమే ఎదురు చూస్తున్న చంద్రబాబునాయుడు... ఒక్క ఉదుటున తన ఆసనం లోంచి లేచి... వినయంగా, చిరునవ్వుతో మోదీజీకి నమస్కరించారు.

"చంద్రబాబు జీ.... వచ్చి ఎంత సేపైంది? ఈ బీహార్ ఎన్నికలలో మన ఎన్‌డీఏకు ఎంత మెజారిటీ అయితే బాగుంటుందా అని ఆలోచిస్తూ ఉంటే నిద్ర పట్టినట్టుంది. మీ స్టేట్‌లో మన వారందరూ కుశలమే కదా! లోకేష్ జీ బాగున్నారా? పెట్టుబడుల కోసం... ఏ ఏ దేశాలు వెళ్లాలనుకుంటున్నాడు. మీరు ఎన్ని దేశాలు తిరిగివచ్చారు? భువనేశ్వరమ్మ హ్యాపీయే కదా! అన్నట్టు, బ్రాహ్మణి, దేవాన్ష్... ఎలా ఉన్నారు? ఎప్పుడో... ఏప్రిల్‌లో చూశాను.." అంటూ కుశల ప్రశ్నలు వేశారు. ఈ మధ్య ఏ ఏ దేశాలకు వెళ్లారు? అని ప్రధాని ప్రశ్నించారు.

దుబాయ్, యుఏఈ, లండన్, మరో దేశం వెళ్లి వచ్చాను అని చంద్రబాబు చెప్పారు. ప్రధాని సంతోషించారు.

"మంచి పని చేశారు చంద్రాజీ. నేను ఇప్పటికి 73 దేశాలు తిరిగాను. మనం ఎంత బయట దేశాలకు తిరిగితే, అంత నాలెడ్జ్ వస్తుంది. పొద్దస్తమానమూ ఇక్కడే ఉంటే... బూజు పట్టిపోతాం. మీరు కూడా ప్రతి పదిహేను రోజులకీ ఎటోకటు వెళ్లి వస్తూ ఉండండి. పెట్టుబడులు వచ్చినా, రాకపోయినా నాలెడ్జ్ వస్తుంది కదా! లోకేష్ జీకి కూడా చెప్పండి. నాలుగు దేశాలు తిరిగి వస్తూ ఉండమని" అంటూ ప్రధాని మెచ్చుకోలుగా భుజం తట్టారు. అంత పెద్ద ప్రధాని... తన గురించి అంత అభిమానంతో మాట్లాడారు గదా అని చంద్రబాబు ఆనందంతో పొంగిపోయారు.

"ఏమీలేదు మోదీజీ! వారూ... మేమూ ముందు ముందు ఎన్నికల రణక్షేత్రంలో తలపడబోతున్నాం కదా... మీ ఆశీస్సులు లేకుండా ఎవరూ ఈ దేశంలో విజయం సాధించలేరు. అందుకే, మీ ఆశీస్సులు కోరడానికే వచ్చాను." అన్నారు చంద్రబాబునాయుడు.

మోదీ జీ చిన్నగా నవ్వారు. "మీకు తెలుసుగా బాబూ జీ. నేను ఏదీ కల్పించుకోను. ప్రధానమంత్రి అంటే... ఎంత హుందాగా ఉండాలి! రాష్ట్రాల్లో ఎన్నికలు వంటి చిల్లర పనులు నా స్థాయికి తగవు. మీరూ మీరూ చూసుకోండి..." అంటుండగానే, బాబు కల్పించుకున్నారు.

"మీరు ఏమీ చేయనవసరం లేదు మోదీజీ. మీ ఆశీస్సులు మాత్రం ఉంటే చాలు. ఎన్నికల సంఘంతో సహా అందరి ఆశీస్సులు ఉన్నట్టే... అది చాలు... అది చాలు..." అన్నారు.. వినమ్రంగా.

చంద్రన్న భక్తి ప్రపత్తులకు ప్రధాని సంతోషించారు.. భుజం తట్టబోయి, ఆగారు. "అన్నట్టు పవన్ కళ్యాణ్‌జీ ఎలా ఉన్నారు? ఇదిగో ఇవి గుజరాత్ చాక్లేట్లు. ఈ నాలుగూ తీసుకెళ్లి, నేను ఇచ్చానని చెప్పి పవన్ కళ్యాణ్‌జీకి ఇవ్వండి..." అన్నారు, ప్రధానమంత్రి.

ఇదంతా ప్రధానికి వెనుక నుంచి చూస్తున్న జగన్‌కు ఒళ్ళు మండిపోయింది. కానీ, అక్కడ సెక్యూరిటీ చాలా ఎక్కువుంటుందనే విషయం గుర్తుకువచ్చి.. మౌనంగా ఉండి.., ఉండలేక... చిన్నగా దగ్గారు.

ప్రధాని వెనక్కు తిరిగి చూశారు.

"జగన్ జీ! ఎంతసేపైంది వచ్చి...." అంటూ జగన్ వైపు ఆప్యాయంగా రెండు చేతులు చాచుకుంటూ అడుగులు వేశారు.

జగన్ తటాలున మోడీజీ కాళ్ళమీద పడబోయారు, ఇదివరకు తిరుపతిలో పడబోయినట్టు.

ప్రధానికి ఆ దృశ్యం గుర్తుకు వచ్చి, అలెర్ట్‌గా ఉన్నారు. కిందికి వంగబోతున్న జగన్‌ను ఒడుపుగా పట్టుకుని, పైకిలేపి ఆత్మీయంగా హత్తుకున్నారు.

"జగన్ జీ... అందరూ కుశలమేనా? మా సోదరి ఎలా ఉన్నారు. సుబ్బారెడీజీ బాగున్నారా? ఇప్పుడు చేతిలో టీటీడీ లేదు కదా, మరిఎలా మేనేజ్ చేస్తున్నారు? గజ్జల్ రామ్‌కృష్ణారెడీజీ బాగున్నారా? ప్రస్తుతం మీకు ఏమైనా సలహాలు ఇస్తున్నారా? లేకపోతే, కొడుకుతో సహా ఢిల్లీ వచ్చేయమనండి, నాకు మంచి మంచి సలహాలు ఇస్తుంటారు. ఆయన కొడుకును బీహార్ పంపుదాం. కాంగ్రెస్ వాళ్ళ మీద దుమ్మెత్తి పోసే ప్రచారం చేస్తాడు. అన్నట్టు, చంద్రబాబు జీ మిమ్మల్ని ఏమీ ఇబ్బంది పెట్టడం లేదు కదా!" అంటూ ఆప్యాయంగా ప్రధాని జగన్‌కి కుశల ప్రశ్నలు వేశారు.

"చంద్రబాబుతో అస్సలు ఇబ్బంది ఏమీలేదు జీ. వెరీ నైస్‌పర్సన్. కాకపోతే ప్రతిపక్షంలో ఉంటున్నాను కదా మోదీజీ. చేతిలో అధికారం లేకపోతే, నెల నెలా మీమీద అభిమానం చూపించడం కష్టమవుతుందనేది నా వర్రీ మోదీజీ. ముందు ముందు చంద్రబాబు పరివారంతో జరగబోయే రణంలో మీ ఆశీస్సులు ఉంటే, అధికారంలోకి వచ్చేస్తాను. దాని కోసం వచ్చాను.." అన్నారు, జగన్ షిరునవ్వుతో.

"చంద్రబాబుకు నా ఆశీస్సులు ఆల్రెడీ ఇచ్చేశాను. నిద్ర లేవగానే, ముందు ఆయననే చూశాను కదా! నీకు ఇవ్వడానికి ఇక నాదగ్గర ఏమీ లేదు. ఈడీ, సీబీఐ, ఇన్కమ్‌టాక్స్.. తప్ప" అన్నారు, మోదీజీ.

జగన్మోహన్‌రెడ్డికి సంతోషం వేసింది.

"ఆ మూడింటి ఆశీస్సులు చాలు మోదీ జీ. మీరు అటువైపు ఉన్నా, మీ మనసంతా నావైపే అని నాకు తెలుసు. ఇబ్బందిలేదు. ఆ మూడింటి ఆశీస్సులు నాకుంటే చాలు... ఆంధ్రప్రదేశ్‌ను ఓ ఆట ఆడుకుంటా. ఇవిగో మా పుల్లారెడ్డి ప్యూర్ ఘీస్వీట్స్. నేతిలో కూడా కల్తీ లేదు." అంటూ మరోసారి వంగబోయారు జగన్. ఇది ముందే ఊహించిన మోదీజీ, రెండు కాళ్ళు వెనక్కి జరిపి, జగన్ భుజం మీద తట్టి.. "నీ పని నువ్వు చేసుకో..." ఆ సంస్థలవారు మీకు అందుబాటులోనే ఉంటారు అని చెప్పి పంపించేశారు. బాబు, జగన్ ఇద్దరూ విజయగర్వంతో బయటకు వచ్చేశారు.

**- భోగాది వేంకట రాయుడు**

• నెల్లూరులో ఘనంగా "సుషుమ్న క్రియా యోగ భోదన"

# యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

## ❖ గురుమాత ఆత్మానందమయి అమ్మవారి పిలుపు





'దివ్య బాబాజీ సుషుమ్న క్రియ యోగా ఫౌండేషన్' సారధ్యంలో సుషుమ్న క్రియా యోగ భోదన నవంబర్ 4వ తేదీ నెల్లూరు వి.పి.ఆర్. కన్వెన్షన్ సెంటర్‌లో భక్తి పూర్వకంగా జరిగింది. గురుపౌర్ణమి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో పూజ్య గురుమాత శ్రీశ్రీశ్రీ ఆత్మానంద మయి అమ్మవారు యోగాతో పాటు జ్ఞానబోధ చేశారు. నిత్యం పనుల వత్తిడితో, మానసిక, శారీరక రుగ్మతలతో సతమత మవుతున్న మానవాళికి యోగా ఉపశమ నాన్ని కలిగిస్తుందని చెప్పారు. దైవం మనకి రోజుకి 23 గంటలే ఇచ్చాడనుకుని మిగి లిన ఒక్క గంటనీ యోగా కోసం వినియో గించుకోవాలని సూచించారు. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. మన ఆరోగ్యం, మన జీవితం మన చేతుల్లోనే ఉందన్నారు. రోజుకి ఒక్క గంటని మీకోసం మీరు కేటాయించుకోండి అని హితవు పలికారు.

దేశ విదేశాల నుండి తరలివచ్చిన సుషుమ్న క్రియా సాధకులతో పాటు తొలిసారి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిచేత 49 నిముషాల పాటు సుషుమ్న క్రియా యోగా సాధన చేయించారు. వంద లాదిమంది ఈ కార్యక్రమంలో పాల్గొని ఓంకార నాదాన్ని మార్మోగించారు. అనం తరం మౌనముద్రతో అమ్మవారిని అనుస రించి సుషుమ్న క్రియ సాధన చేసి దీక్ష తీసుకున్నారు.

అమ్మవారి ఉపదేశం, దీక్షా సందేశం అనంతరం ప్రధాన అతిథులని ఆమె ఆశీ ర్వదించి సత్కరించారు. ఈ సందర్భంగా 'పద్మభూషణ్' వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ యోగా యొక్క ప్రాధాన్యతని తెలిపారు. పూజకి, ధ్యానానికి మధ్య వున్న వ్యత్యా సాన్ని వివరించారు. పూజలో మనం మాట్లాడతామని, దేవుడికి కృతజ్ఞతలు చెప్తామని అన్నారు. అదే ధ్యానంలో మనల్ని మనమే వింటామని చెప్పారు. ఆత్మజ్ఞానం, తత్వవిచారణ, ఆత్మబోధ వంటి గొప్ప ఉత్తుంగ తరంగాల వంటి పదాలకి, అంశాలకి పుట్టినిల్లు మన భారతదేశం అన్నారు. ఇలాంటి ఆలో చనలు, ఇటువంటి ప్రక్రియలు పాశ్చాత్య దేశాలలో లేవన్నారు. గురు మాట, బోధించిన ధ్యాన ప్రక్రియని అందరూ తప్ప కుండా ఆచరించాలని ఆకాంక్షించారు.

పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ తాను చిన్న తనంలో హార్స్‌లీహిల్స్‌లోని రిషివ్యాలీ స్కూల్‌లో చదువుకునే రోజుల్లో జిడ్డు కృష్ణ మూర్తి యోగా గురించి, ధ్యానం గురించి చెప్పేవారని. ఆ వయసులో అవన్నీ నిర్లక్ష్యం చేశామని అన్నారు. ఉదయం లేదా సాయంత్రం ప్రతిఒక్కరూ గురుమాత బోధించిన విధానాన్ని తప్పకుండ పాటిం చాలని, తాను కూడా క్రమంతప్పకుండా ధ్యానాన్ని చేస్తానని చెప్పారు.

సామాజిక మాధ్యమాల ప్రభావంతో నేటి యువత చెడు మార్గంలో వెళ్తోందని, ఇలాంటి కార్యక్రమాలని ఆదర్శంగా తీసుకుని యువతరం తమ జీవితాలని తీర్చిదిద్దుకోవాలని కోవూరు శాసన సభ్యు రాలు ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు.

రోజూ రాజకీయాలతో తలమునకలై పరస్పర దూషణలు, మాటల దాడులు, ప్రతిదాడులతో తమ జీవితం గడిచిపో తుందని సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈరోజు గురు మాట కల్పించిన దీక్షా స్ఫూర్తి 15 సంవత్స రాల క్రితమే ఇచ్చి వుంటే తమ ఆరోగ్యాలు చాలా బాగుండేవని అన్నారు.



గురుమాతకి జన్మనిచ్చిన మాతృమూర్తి నెల్లూరీయురాలు కావడం ప్రతీ నెల్లూరీ యుడూ గర్వించదగిన విషయమని 'లాయర్' పత్రిక సంపాదకులు శివ ప్రభాత్‌రెడ్డి చెప్పారు.

అమ్మవారి ఆగమనానికి ముందు అమ్మవారి సోదరి శ్రీమతి ప్రశాంతిరెడ్డి నేతృత్వంలో శాంతా బయోటెక్నీక్స్ వ్యవస్థా పకులు 'పద్మభూషణ్' డాక్టర్ కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డి, నెల్లూరు పార్ల మెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి , మాజీ మంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి గురువుల చిత్రపటాల ముందు జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్ర మానికి అంకురార్పణ చేశారు. అనంతరం ధ్యానం వల్ల కలిగే వైజ్ఞానిక ప్రయోజనాలని డాక్టర్ మధుశ్రీ వివరించారు.

గురుమాత శిష్యురాలు, ప్రముఖ న్యాయవాది, శాస్త్రీయ నృత్య కళాకారిణి శ్రీమతి శ్రుతకీర్తి వ్యాఖ్యాన నిర్వహణలో ఈ కార్యక్రమం 'నభూతో నభవిష్యత్' అన్న తరహాలో జరిగింది. ప్రధాన కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రముఖ గాయని శ్రీమతి జమ్మలమడక గాయత్రి ఆల పించిన అన్నమయ్య సంకీర్తనలని సుప్రసిద్ధ నాశికా వేణుగాన కళాకారుడు సాయి హేమంత్ కృష్ణ తన మురళీనాదం ద్వారా వినిపించి ఆహూతులని రవళింపజేశాడు. కార్యక్రమం ఆద్యంతం అత్యంత భక్తి భావంతో, ఆధ్యాత్మికతత్పరతతో జర గడం విశేషం!

---

### గణేష్ ఘాట్‌లో...

## ఘనంగా కార్తీక దీపోత్సవం





నెల్లూరు చెరువుగట్టున ఉన్న గణేష్‌ఘాట్‌లో ఈనెల 5న సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక దీపోత్సవం జరిగింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. శోభా యాత్రలో మహిళలు వేలాదిగా తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించడంతో గణేష్‌ఘాట్ ప్రాంతమంతా ఆ దీపాల వెలుగులతో దేదీప్యమానమైంది. శివనామ స్మరణలతో ఆ ప్రాంగణం మార్మోగింది. సాయంత్రం హరిద్వార్ నుంచి వచ్చిన అర్చకులు నిర్వహించిన గంగాహారతి కార్యక్రమం కన్నులపండువగా సాగింది. గణేష్‌ఘాట్‌లో ఏర్పాటుచేసిన శివాకృతికి పుణ్యనదీజలాలతో అభిషేకం చేశారు. డ్రోన్ల సహాయంతో భక్తజనులపై ఆ అభిషేక జలాలను చల్లారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అక్కడ ఏర్పాటుచేసిన శివలింగానికి పూజలు, అభిషేకాలు చేశారు. దీపోత్సవ సమితి సభ్యుల పర్యవేక్షణలో జరిగిన దీపోత్సవ ర్యాలీలు, జ్వాలాదీపం, ఆకాశదీపం, ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్ర మాలు అన్నీ ఆద్యంతం భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పి.సత్యనారాయణ, శ్రీకంఠం రమణయ్య, కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు వెన్నెల, సమితి సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

---

### ఇందిరమ్మ సేవలు

## చిరస్మరణీయం

**- కాంగ్రెస్ నేత చేవూరు -**



భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిర స్మరణీయం మని జిల్లా కాంగ్రెస్ అధ్య క్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి కొనియాడారు ఇందిరా గాంధీ 41వ వర్ధంతి సందర్భంగా ఇటీ వల నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అదే విధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయం తిని పురస్కరించుకుని ఆయనకు పుష్పాం జలి ఘటించారు. అనంతరం డీసీసీ నేత చేవూరు మాట్లాడుతూ, దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు అపారమన్నారు. గరీబీ హఠావో కార్యక్ర మాన్ని చేపట్టి నిరుపేదల జీవితాలకు వెలుగుబాటలు వేసి, ఇందిరమ్మ అంటేనే పేదలకు ఆరాధ్యనేత అనిపించుకున్నా రన్నారు. కాంగ్రెస్ నాయకులు ఏటూరు శ్రీనివాసులురెడ్డి, బాలసుధాకర్, మోహన్ రెడ్డి, గణేష్‌బాబు, అల్లావుద్దీన్, ఫజలుద్దీన్, రాజేష్‌రెడ్డి కిషోర్ తదితరులు పాల్గొన్నారు

---



### సుబ్బానాయుడి కుటుంబానికి..

## లోకేష్ పరామర్శ

ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మెన్ దివంగత మాలెపాటి సుబ్బానాయుడు కుటుంబసభ్యులను యువనేత..రాష్ట్ర విద్యా మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. గురువారం ఆయన నెల్లూరుజిల్లా దగదర్తికి వచ్చి సుబ్బానాయుడు, భానుచందర్ చిత్ర పటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. లోకేష్‌తో కలసి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు సుబ్బానాయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి సుబ్బానాయుడుతో మంచి పరిచయం ఉందని, సుబ్బానాయుడు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని, ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి, మంచి వైద్యం అందించాలని కూడా వైద్యులకు సూచించినట్లు చెప్పారు. సుబ్బానాయుడు మృతి చెందడం బాధాకరమని, పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, నాయకులు బీద మస్తాన్‌రావు, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

లాయర్
నవంబర్ 07, 2025

# విశ్వక్రీడావనిలో మన మహిళలే జగజ్జేతలు

విశ్వ క్రీడావనిలో భారతీయ మహిళలు అద్వితీయ ప్రతిభతో రాణించి ప్రపంచ కప్‌ని సాధించడం ఓ అద్భుతం. భారత నారీశక్తికి ఇదో పెద్ద నిదర్శనం. ముంబైలో ఇటీవల జరిగిన మహిళల వన్‌డే వరల్డ్ కప్ క్రికెట్ పోటీలో మన మహిళామణులు విజయదుందుభి మోగించడం చరిత్రాత్మకం. దాదాపు అయిదు దశాబ్దాలుగా ఇదిగో అదిగో వచ్చేస్తుందను కున్న ప్రపంచకప్ చేతికి అందకుండా నిరాశకు గురిచేస్తూనే ఉండేది. అయినప్పటికీ మొక్కవోని ఆత్మస్థైర్యంతో భారత మహిళా జట్టు ఈసారి మైదానంలో మెరుపులు మెరిపించింది. ఫైనల్స్‌లో ప్రత్యర్థి జట్టు దక్షిణాఫ్రికాను ఓడించి, మొట్టమొదటి సారిగా భారత్ విజయదుందుభి మోగించింది. ప్రపంచ మహిళా క్రికెట్ చరిత్రలోనే మన టీమిండియా మహిళా జట్టు సరికొత్త అధ్యాయాన్ని సృష్టించింది.

అయినా.. క్రికెట్‌లో ప్రపంచకప్ సాధించాలన్నది మన క్రీడాకారిణులకు ఇప్పటి స్వప్నం కాదు. 1978 నుంచి అందు కోసం ఎంత కష్టపడి ఆడుతున్నా.. ఆశించిన ఫలితం లభించ లేదు. ఈ నేపథ్యంలో వారు ఎన్ని కష్టాలు పడ్డారో, ఎన్ని అవమా నాలు సహించారో, అపజయాలతో ఎన్నెన్ని అవహేళనలు భరించారో లెక్కే లేదు. ఎట్లయితేనేం.. ఈసారి మాత్రం అనితరసాధ్యమైన క్రీడాస్ఫూర్తితో రాణించి ప్రపంచ కప్‌ని సాధించి పంతం నెగ్గించుకున్నారు. దీంతో, 47 ఏళ్ళ నాటి కల సాకారమైనట్లయింది. ముంబై మైదానంలో ఎంతో ఉత్కంఠభరితంగా, ఉద్వేగంగా జరిగిన ప్రపంచ కప్ పోటీల చివరిరోజున వేదికపై ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. దక్షిణాఫ్రికా జట్టుతో జరిగిన ఆఖరిపోరులో భారత్ సాధించిన ఈ చరిత్రాత్మక విజయం అపూర్వం!. టీమిండియా జట్టుకి సారథ్యం వహించిన హర్మన్ ప్రీత్ కౌర్, బ్యాటింగ్‌లో పరుగుల వరదను సృష్టించిన స్మృతి మంధాన, ప్రతీకా రావల్, షఫాలీ వర్మ, అమన్ జోత్, రిచా ఘోష్‌తో పాటు బౌలింగ్‌లో దీప్తిశర్మ, క్రాంతి గౌడ్, రేణుకాసింగ్.. ఇలా జట్టులోని ఒక్కొక్కరూ ఒక్కో క్రీడాకెరటమై ఉవ్వెత్తున ఎగసి..ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూపించారు. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. భారతీ యుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తించారు. అందులోనూ ప్రత్యేకించి మన తెలుగుబిడ్డ..కడపజిల్లాకి చెందిన శ్రీచరణి చాకచక్యంగా చేసిన బౌలింగ్ కూడా జట్టు విజయానికెంతో తోడ్పడడం తెలుగుజాతికి గర్వకారణం. అయితే, గతంతో పోల్చుకుంటే మనదేశ క్రీడారంగం ఇటీవలి కాలంలో కొంతమేరకు కొత్తపుంతలు తొక్కుతోందనే అనుకోవచ్చు. ఆర్థికంగా తోడ్పాటు లేక క్రీడారంగంలోకి రావాలంటేనే నిరాశ ఆవరిస్తున్న పరిస్థితుల నుంచి, ఇప్పుడిప్పుడే క్రీడాలోకం మెల్లమెల్లగా ఆశావహ స్థితిలోకి వస్తోంది. క్రీడారంగంలోని వారికి ప్రోత్సాహాలు, గెలిచినవారికి నజరానాలు కూడా భారీ గానే వస్తున్నాయి. అయితే, అంతమాత్రాన అంతా బాగుం దనుకోలేం. మనదేశంలో మహిళలు క్రీడల్లోకి రావాలన్నా, విజయాలు సాధించాలన్నా.. అందుకు తగ్గ ప్రోత్సాహం మాత్రం ఉండడం లేదన్నది వాస్తవం. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, క్రీడా కోచ్‌లు అందరూ సహకరించి క్రీడా కారిణులు మరిన్ని విజయాలు సాధించేలా ప్రోత్సహించాలి. బాలికలు, లేదా మహిళల పట్ల చిన్నచూపు చూడకుండా చిన్నతనం నుంచి.. పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో ప్రోత్సాహం ఉంటే వారెన్నో అద్వితీయ విజయాలు సాధిస్తా రనడంలో ఎలాంటి సందేహం లేదు. గతంలో కూడా ఎన్నో ఇబ్బందులను అధిగమించి క్రీడల్లో ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన క్రీడామణులెందరో ఉన్నారు. ఒలింపిక్స్‌లో ఏకంగా రెండు పతకాలు సాధించిన మనూ భాకర్, బాక్సింగ్‌లో అదరగొట్టిన మేరీ కోమ్, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, బ్యాడ్మింటన్ చాంపియన్..మన తెలుగువారి ఆణిముత్యం పీవీ సింధూ..ఇంకా కోనేరు హంపీ, దివ్యాదేశ్‌ముఖ్, వైశాలి తదితర క్రీడా దిగ్గజాలెందరో ఆదినుంచీ ఎన్నో కష్టనష్టాలకు ఎదురీదినవారే. అదే స్ఫూర్తితో నేటితరం మహిళలు ముందుకు సాగుతుండడం హర్షదాయకం. ఏదేమైనా, భారత నారీమణుల క్రీడాప్రతిభకు ఈ ప్రపంచ్ కప్ విజయం నిలువెత్తు నిదర్శనం. కాస్తంత చేయందిస్తే చాలు. ఆ తర్వాత మనల్నే కాదు..దేశాన్నే ముందుకు నడిపిస్తామనేంత ధీరత్వంతో ఎదుగుతున్న మన క్రీడాకారిణులు నిజంగానే భారత కీర్తి కిరీటాలు. ఇప్పుడు ఏకంగా ప్రపంచకప్‌నే సాధించి చాంపియన్‌లుగా నిలవడం దేశానికే గర్వకారణం. ఈ అపూర్వ విజయం.. నవతరానికి మార్గదర్శకంగా నిలుస్తుం దనడంలో సందేహం లేదు. భారత్‌కి ఇంతటి ఘనవిజయాన్ని తెచ్చిపెట్టిన భారత మహిళా క్రికెటర్లందరికీ జేజేలు!

## తిరుమలలో డోనార్ సెల్ సిబ్బంది తీరు మార్చుకోవాలి!

తిరుమలలో స్వామివారికి విరాళాలు సమర్పించే వారికోసం డోనార్ సెల్ పేరుతో ప్రత్యేక విభాగాన్నే ఏర్పాటు చేశారు. అయితే, అక్కడ పనిచేసే సిబ్బంది వ్యవహారశైలి అభ్యంతరకరంగా ఉంది. అయిదు లక్షల నుండి కోటి రూపాయల వరకూ ఇచ్చే భక్తులు ఈ సెల్‌ని ఆశ్రయిస్తుంటారు. తాము ఇచ్చిన విరాళాలకు సంబంధించి లభించే సదుపాయాల వివరాలని ఆ డోనార్ సెల్‌ని సంప్రదించి తెలుసుకుంటుంటారు. అయితే, అక్కడ విధులు నిర్వహించే టీటీడీ ఉద్యోగులు దాతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దాతలు వ్యక్తపరచే సందేహాలను నివృత్తి చేయడంలో అలక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దాతలు అడిగే ప్రశ్నలకు ముక్తసరిగా సమాధానాలు ఇస్తున్నారు. వాళ్ళ తీరుమారాలి. స్వామివారిపై భక్తితో లక్షల రూపాయలని విరాళంగా సమర్పించుకుంటున్న వారిపట్ల ఆదరభావం పెరగాలి. దాతలని గౌరవించడం నేర్చుకోవాలి. ఆ దిశగా టీటీడీ పాలకమండలి మరియు అధికారులు చర్యలు తీసుకోవాలి. – *బి. హేమంత్‌కుమార్‌రెడ్డి*, **బెంగళూరు.**

## చినుకు పడితే చెరువే... ఇదీ మాగుంట లే అవుట్ దుస్థితి!

గత వారం నెల్లూరు నగరంలో విరామం లేకుండా 24గంటల పాటు వర్షం కురిసింది. అది భారీ వాన కాదు, అలా అని తుప్పరా కాదు. కేవలం సుమారైన వాన మాత్రమే. ఆ తేలికపాటి వర్షానికే మాగుంట లేఅవుట్ మొత్తం చెరువుగా మారిపోయింది. రోడ్లన్నీ నీటిమయమైపోయాయి. ఖాళీ స్థలాలన్నీ నీళ్ళతో నిండిపోయాయి. ముఖ్యంగా ఎస్.ఆర్.కే స్కూలు నుండి అన్నమయ్య కూడలికి వెళ్లే దారిలో మోకాలులోతు నీళ్ళు నిలబడిపోయాయి. ఆ మార్గంలో వున్న ఖాళీస్థలాలే అందుకు ప్రధాన కారణం. చాలా మంది స్థల యజమానులు తమ ఖాళీ స్థలాలని మట్టితో పూడ్చకుండా వదిలేస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఆ ప్లాట్లలో నీళ్ళు నిండిపోతున్నాయి. అవి పొంగి పొరలి రోడ్లపైకి చేరుతున్నాయి. వర్షాలు తగ్గాక కూడా ఆ నీళ్ళు అలాగే నిలబడిపోయి, ఆ ప్లాట్లు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోతున్నాయి. నాయకులు, అధికారులు మేల్కొని ఖాళీ ప్లాట్ల యజమానులపై దృష్టిపెడితే తప్ప మాగుంట లే అవుట్ చినుకు పడితే చెరువే! – *వీ.సీ.చౌదరి*, **మాగుంట లే అవుట్.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## శీర్షికలు బాగుంటున్నాయి!

ప్రతీవారం క్రమం తప్పకుండా స్థానిక, రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ విశేషాలతో వార్తల సమాహారాన్ని అంది స్తున్న మన 'లాయర్'కి అభినందనలు. మొదటి పేజీలో రాష్ట్ర, దేశ రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నారు. అలాగే సంపాదకీ యంలో ప్రాధాన్యత కలిగిన అంశాలని స్ఫురిస్తున్నారు. 'సత్యపీఠం' ద్వారా నిజాలని నిర్భయంగా ప్రచురిస్తున్నారు. 'మనసులో మాట'తో అంతర్జాతీయ అంశాలని ఆవిష్క రిస్తున్నారు. మిగిలిన అన్ని పేజీలలో జిల్లా వార్తలకి, సాహిత్య సభలకి, పుస్తక సమీక్ష లకి, జిల్లా రాజకీయ నేతల కార్యక్రమాలకి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలా సకల రుచులు అందించే 'తాలి'(భోజనం)లా ప్రతీవారం 'లాయర్'ని పాఠకుల చెంతకు చేరుస్తు న్నారు. నలభై నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ అక్షర సమరం నిర్భయంగా, నిరంత రాయంగా, కలకాలం కొనసాగాలని కోరు కుంటున్నాను. – *ఎన్.గోవర్ధనరావు*, **క్యాలిఫోర్నియా.**

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 115

## ప్రకోపిస్తున్న ప్రకృతి, ఆపదలో అన్నదాతలు!

రైతన్నలు దేశానికి వెన్నెముక అంటారు. అలాంటి అన్నం పెట్టే అన్నదాతకి నిరంతరం కష్టాలే ఎదురవుతున్నాయి. వ్యవసాయం నిజంగానే ఒక జూదంలా తయారై రైతుల జీవితాలతో ఆటలాడుకుంటోంది. అకాలవర్షాలొచ్చి పంటలను ఎప్పుడు ముంచేస్తాయో తెలీదు. సమయానికి కురవాల్సిన వానలు కురవకుండా పంటలెప్పుడు ఎండిపోతాయో తెలీదు. దీంతో, రైతు జీవితం నిత్యం ఆశనిరాశల మధ్యనే కొట్టమిట్టాడుతుంటుంది. పేదరైతుల జీవితాలైతే మరీ దీనాతి దీనంగా ఉం టున్నాయి. అప్పు చేసో లేక ఇంటి ఇల్లాలి పుస్తెలు తాకట్టుపెట్టో, రేయింబవళ్ళు కష్టపడి పంట పండిస్తారు. తీరా ఆ పంట మార్కెట్లోకి వస్తే గిట్టుబాటు ధర ఉం డదు. కూటినీళ్ళకి పంటను తెగనమ్ముకోవల్సిన దుస్థితి ఏర్పడుతోంది. దళారులు ఓ వైపు, వ్యాపారులు మరోవైపు రైతులని నిలువునా దగా చేసి దోచుకుతింటుంటారు. చివరికి ఆ బక్కచిక్కిన రైతులకు మిగిలేది ఎండిన డొక్కలు, కంట్లో నీళ్ళే. ఇన్ని ఎదురుదెబ్బలు తగులుతున్నా ఏనాటికైనా మంచిరోజులు రాకపోతాయా, అప్పులన్నీ తీరకపోతాయా అన్న గంపెడు ఆశతో తన స్వేదమంతా ధారపోసి సేద్యం చేస్తూనే ఉంటాడు రైతన్న. అలాంటి పరిస్థితుల్లో ప్రకృతి కూడా అన్నదాతలపై కక్షకట్టి భారీవానలు, తుఫాన్ల వంటి విపత్తులతో రైతు కొంప కొల్లేరు చేస్తే, ఇక ఆ రైతు పరిస్థితి ఎంత దయనీయంగా మారుతుందో ఊహించుకోవచ్చు.

మొన్నటికి మొన్న ఉభయ తెలుగు రాష్ట్రాల్లో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలు భీభత్సం సృష్టించాయి. ప్రధానంగా రైతుల జీవితాలని అల్లకల్లోలం చేశాయి. భారీ వానల దెబ్బకి వాననీళ్ళు పొలాల్లో నిలిచిపోయాయి. నారుమళ్ళు కుళ్లిపోయాయి. పైరు ఏపుగా ఎదుగుతున్న దశలో మునకకి గురైపోయింది. కొన్నిచోట్ల చేతికందొచ్చిన పంట కొట్టుకుపోయింది. ఈ హఠాత్‌పరిణామాలన్నిటితో రైతన్న కుదేలైపోయాడు. వరి, వేరుశనగ, కంది, మినుము ఇలా ఒకటీ రెండూ అని కాకుండా.. అన్ని రకాల పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. నిమ్మ, సపోటా, జామ, అరటి వంటి పండ్ల తోటలు సైతం భారీవానలకు, పెను గాలులకు ధ్వంసమైపోయాయి. మొంథా కారణంగా ఎక్కువ నష్టం వరి పంటకే జరిగిందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. అయితే, ఇంతటి భారీ విపత్తులో ఎక్కువగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించిందని చెప్పొచ్చు.

### ఆకస్మిక వానలతో భారీగా నష్టం!

ఉరుము లేని మెరుపులా వచ్చిన వానలు, వాటితో పాటుగా వచ్చిన 'మొంథా' తుఫాన్ ఈసారి రాష్ట్ర రైతాంగాన్ని అమాంతం ముంచేశాయి. దాదాపు లక్షా 38 వేల హెక్టార్లకు పైగా పంటలు నీట మునిగిపోయి వుంటాయని, అన్నదాతలకి కనీసం 829కోట్లకు పైగా నష్టం జరిగి ఉంటుందని అధికారుల ప్రాథమిక అంచనా. నిజానికి, ఈ నష్టం అంతకు రెట్టింపుగా వున్నా మనం ఆశ్చర్యపడాల్సిన పని లేదు. ఎందుకంటే, ఎక్కడో దూరప్రాంతాల్లో మారుమూల గ్రామాల్లో ఉన్న వేలాది ఎకరాల పంటపొలాలకి వచ్చిన నష్టాన్ని అంచనా వేయడం అంత సులభం కాదు. ఈ అనుకోని ప్రకృతి వైపరీత్యంతో జరిగిన నష్టాన్ని అంత తక్కువ సమయంలో లెక్కగట్టడ మన్నది కూడా సాధ్యమయ్యేపని కాదు. జరిగిన నష్టానికి సంబంధించిన నివేదికలు కేంద్ర ప్రభుత్వానికి వెంటనే పంపాలి. కాబట్టి, అధికారులు అందుబాటులో ఉన్న మేరకు అంచనాలు వేసి పంపించడం షరామామూలే. వర్షాలు తగ్గిన వెంటనే మొత్తం పొలాలన్నిటిని సందర్శించి అంచనాలు తయారు చేయడం అసాధ్యం. సంబంధిత ప్రభుత్వ అధికారులు సదరు పొలాలని చేరుకునేలోగా మరో వాయుగుండం పుట్టి మళ్ళీ వానలు రావన్న గ్యారెంటీ లేదు. అంచనా వేసిన పరిహారాల ఫైళ్ళు అటకెక్కకుండా, బాధిత రైతులందరికీ త్వరతగతిన సాయం అందే ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత కూడా అధికార యంత్రాంగానిదే. ముందుగా, దెబ్బతిన్న కాలువలను మరమ్మతులు చేయించాలి. తెగిపోయిన చెరువుల గండ్లు పూడ్పించాలి. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో నష్టాన్ని ఇప్పటికిప్పుడు అంచనా వేయడం కత్తిమీద సామే.

### ఆపదలో వున్న అన్నదాతకి ప్రభుత్వమే అండగా నిలవాలి!

సాంకేతికత వెల్లువెత్తుతున్న నేటిరోజుల్లో పంట వివరాలు నమోదుకు ప్రభుత్వం గత కొంతకాలంగా ప్రయత్నిస్తూనే ఉంది. ప్రతి రైతూ తమ పంట వివరాలతో ఈకేవైసీ చేయించుకోవాలని, లేకుంటే ప్రభుత్వ పథకాలు అందవని కూడా తరచూ వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తూనే వుంది. కానీ, దురదృష్టవశాత్తూ అనేక గ్రామాల్లో వేలాదిమంది రైతులకు ఇలాంటివేమీ తెలియదు. వాటిని ఎలా నమోదు చేసుకోవాలో అవగాహన ఉండడం లేదు. అందువల్ల పంట నష్టాల వివరాలు కూడా సమగ్రంగా ప్రభుత్వానికి అందడం లేదు. మరికొంతమంది రైతులు పరిహారం కోసం అధికారుల చట్టూ తిరగలేక, వారు పెట్టే నిబంధనలు పాటించలేక మౌనంగానే నష్టాన్ని భరిస్తూ కష్టాలని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులన్నిటినీ ప్రభుత్వాలు పెద్దమనసుతో అర్థం చేసుకుని, నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చూడాలి. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కఠినతరమైన నిబంధనలని పక్కనపెట్టాలి. నష్టపోయిన ప్రతి రైతుకీ పరిహారం అందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. కష్టాల నుంచి కోలుకుని, మళ్ళీ సేద్యం చేసుకునేందుకు వీలుగా అన్నదాతలకి అవసరమైన ఆర్థిక చేయూతతో పాటు విత్తనాలు-ఎరువులు- పురుగు మందుల వంటి వ్యవసాయ సామగ్రి రాయితీ ధరలకు ఇవ్వాలి. తీవ్రంగా నష్ట పోయిన పేదరైతులకి వాటిని ఉచితంగా అందజేసేలా ఏర్పాట్లు చెయ్యాలి. రైతుల కోసం ప్రత్యేకంగా అమలుచేస్తున్న కేంద్ర రాష్ట్ర పథకాలన్నీ అసలైన లబ్దిదారులకు చేరేవిధంగా చర్యలు చేపట్టాలి. శాశ్వత ప్రాతిపదికన పర్యవేక్షక అధికార బృందాలను నియమించి, ఎక్కడా ఎలాంటి తప్పిదాలు జరగకుండా కట్టుదిట్టం చేయాలి.

ఏదేమైనా, రాష్ట్రంతో పాటు కేంద్రప్రభుత్వం కూడా ఉదారంగా ఆదుకుంటే తప్ప ఈ విపత్కర విపత్తుల వేళ నష్టాల గండాల నుంచి కష్టాల సుడిగుండాల నుంచి అన్నదాతలు కోలుకోలేరన్నది కఠిన వాస్తవం...! - *రాజశ్రీ*

## పేదల ఇళ్ళ నిర్మాణాల్లో..

# అన్నీ అవకతవకలే

**• వైసీపీ పాలనలో తిన్న డబ్బునంతా కక్కించాలన్న సోమిరెడ్డి**



గత వైసీపీ ప్రభుత్వం నిరుపేదల ఇళ్ళ నిర్మాణాల్లో అనేకరకాల అవకతవకలకు పాల్పడిందని, సర్వేపల్లి నియోజకవర్గంలో వైకాపా నాయకులు పేదల ఇళ్ళపేరుతో డబ్బునంతా మెక్కేశారని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి విమర్శించారు. ఇటీవల ఆయన తోటపల్లిగూడూరులోని పలు గిరిజన కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరిగొండలో ఒక్క బేస్‌మెంట్ కూడా సరిగా లేదని, ఇటీవలే ఇక్కడికొచ్చిన ప్రత్యేక బృందం తన పరిశీలనల్లో నిగ్గు తేల్చిందన్నారు. వైసీపీ పాలనలో 15వేలతోనే బేస్మెంట్ వేసి రూ. 70వేల దాకా సొమ్ములు గుంజుకున్నారని ఆయన ఆరోపించారు. అలా వేలాదిమంది గిరిజనులు, దళితులను, నిరుపేదలను మోసం చేశారని, వీటన్నిటిపై జాతీయ ఎస్టీఎస్సీ కమిషన్లకు ఫిర్యాదు చేసి, డబ్బు మెక్కేసిన వారి దగ్గరనుంచి ఆ డబ్బునంతా కక్కించి, తిరిగి నాణ్యతతో ఇళ్లను నిర్మాణం చేయించాలన్నారు.

**పింఛన్ల పంపిణీలో ఆంధ్రాయే అగ్రగామి! :**

పింఛన్ల పంపిణీలో ఆంధ్రరాష్ట్రమే అగ్రస్థానంలో ఉందని, ప్రతి నెలా పండుగలా పింఛన్ల పంపిణీ జరుగుతోందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లి గూడూరులో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంతో పోల్చుకున్నా మన రాష్ట్రమే నెంబర్–1గా ఉందన్నారు. పింఛన్లకు రూ. 8వేల కోట్లు ఖర్చు పెడుతున్న తెలంగాణ రెండో స్థానంలో ఉంది. అయినా.. ఆ రాష్ట్రంలో పింఛన్ రూ.2016 మాత్రమేనన్నారు. దేశంలో పెద్ద రాష్ట్రమైన మహారాష్ట్ర రూ.1000 వంతున పింఛను అందజేస్తూ ఏడాదికి రూ.3841 కోట్లు మాత్రమే ఖర్చుపెడుతోందన్నారు. మన రాష్ట్రంలో ఏటా 67 లక్షల 71 మందికి ప్రతి నెలా పింఛన్ పంపిణీ జరుగుతోందని, అందుకు ప్రభుత్వం దాదాపు 34వేల కోట్లు ఖర్చు చేస్తోందని ఆయన వివరించారు. దేశంలో ఇదే అత్యధికమన్నారు.

# బుచ్చిలో.. కొత్తమార్కెట్‌కి త్వరలోనే ప్రారంభోత్సవం

**• ఎమ్మెల్యే ప్రశాంతమ్మ వెల్లడి**



బుచ్చి పట్టణంలో కొత్తగా నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్‌ను త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల ఆమె ఆ మార్కెట్ నిర్మాణపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెరుగుతున్న పట్టణ ప్రజావసరాల దృష్ట్యా మార్కెట్ విస్తరణ చేపట్టడం జరిగిందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రి నారాయణల చేతుల మీదుగా త్వరలోనే నూతన మార్కెట్‌కి ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. గతంలో 24 షాపులు ఉన్న మార్కెట్ కాంప్లెక్స్‌లో ఇప్పుడు కొత్తగా 61 షాపులు నిర్మించడంతో మున్సిపాలిటీకి ఆదాయం పెరగడంతో పాటు, 40 మందికి ఉపాధి దొరికిందన్నారు. గ్రేడ్ 2 హోదా పొందిన బుచ్చి పట్టణానికి నూతన మార్కెట్ కాంప్లెక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. బుచ్చిరెడ్డి పాళెం తరహాలోనే కోవూరులో కూడా పీ4 విధానం ద్వారా నూతన మార్కెట్ నిర్మాణం చేపడతామన్నారు. బుచ్చిలో మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణానికి ముందుకు వచ్చిన తేజా డెవలపర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డిని ఆమె అభినందించారు. బుచ్చి పట్టణ మున్సిపల్ కమిషనర్ డి.బాలకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్‌కి 'బెస్ట్ క్లబ్' అవార్డు





నెల్లూరు ఏసీస్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ఇటీవల పలు అవార్డులు లభించాయి. గుంటూరులోని సూర్యదేవర కళ్యాణ మండపంలో ఈనెల 2న జరిగిన 203 డిస్ట్రిక్ కాన్ఫరెన్స్ మరియు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో, 2025వ సంవత్సరంలో చేసిన సేవా కార్యక్రమాలు గుర్తించి ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌కి బెస్ట్‌క్లబ్ అవార్డు ఇవ్వడం విశేషం. అదేవిధంగా ఉత్తమ ప్రెసిడెంట్‌గా అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడుకి, బెస్ట్ ట్రెజరర్ అవార్డు మాగంటి ప్రసాద్‌కి, బెస్ట్ సమ్మర్ క్యాంప్ అవార్డు, బెస్ట్ మెడికల్ క్యాంప్ అవార్డు, బెస్ట్ అప్రీసియేషన్ సెక్రటరీ అవార్డు జి.నారాయణరెడ్డి కైవసం చేసుకున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి, 203 గవర్నర్ పెద్ది శివరాం ప్రసాద్ చేతులమీదుగా ఆ అవార్డులను బహుకరించారు. ఏసీ స్టేడియం మహిళా వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జే.వసుంధరకి కొల్లూరు మెమోరియల్ ఔట్‌స్టాండింగ్ సర్వీస్ అవార్డును ప్రదానం చేశారు. బెస్ట్ మహిళా క్లబ్ అవార్డు, బెస్ట్ వాటర్‌ప్లాంట్ అవార్డు కూడా వారికి లభించాయి. వాకర్స్ ప్రతినిధులు చెలికాని సీతారామయ్య, నేతాజీ సుబ్బారెడ్డి, వాకర్స్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఏకొల్లు రాఘవరెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, బెల్లం చెంచయ్య, మన్నేపల్లి సురేష్, పత్తిపాటి రమణయ్య, పులగల సుబ్బారావు, వినుకొండ వెంకటేశ్వర్లు, కె శివయ్య, ఎంఎన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



# కాశీబుగ్గ బాధితులకి ఆనం పరామర్శ

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తొక్కిసలాట జరిగి పలువురు భక్తులు మృతిచెందడంతో, రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈనెల 2న ఆ ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఘటన జరిగిన తీరు, భక్తుల రద్దీ వివరాలు, భద్రతా ఏర్పాట్లు తదితర సమాచారాన్ని ఆయన అధికారుల నుంచి తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించారు. ఆలయంలో దుర్ఘటన జరిగి మరణాలు సంభవించడం బాధాకరమన్నారు. ఈ ఆలయం పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉందని, దేవాదాయ శాఖ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున భక్తులను సమీకరిస్తున్నప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడం తప్పనిసరి అని ఆలయ నిర్వాహకులకు సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా భరోసాగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రైవేటు ఆలయాలకు కూడా భద్రతా మార్గదర్శకాలు రూపొందించాలనే దిశగా ఆలోచిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# వైద్యకళాశాలల ప్రైవేటీకరణ అన్యాయం

**11న కోవూరులో నిరసన ర్యాలీ - వైసీపీ నేత నల్లపరెడ్డి ప్రసన్న**



వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని వైసీపీ నేత, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నరెడ్డి చెప్పారు. వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేసే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా ఇటీవల కొడవలూరు మండలం దామేగుంట గ్రామంలో జరిగిన రచ్చబండ మరియు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు ఆమోదించబడ్డాయని, వాటిలో ఏడు మెడికల్ కాలేజీలను వైసీపీ హయాంలోనే పూర్తిగా నిర్మించడం జరిగిందన్నారు. అయితే, కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటి ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా అందరం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రజా ఉద్యమం పేరుతో ఈనెల 11న కోవూరు బజార్ సెంటర్ నుండి ఎంఆర్ఓ కార్యాలయం వరకు జరిగే నిరసన ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు. డీసీఎంఎస్ మాజీ ఛైర్మెన్ వీరి చలపతి, నియోజకవర్గ పరిశీలకులు, కొండూరు అనిల్ బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

# దేవాంగ సంఘానికి అండగా ఉంటాం!



కార్తీకమాసం సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఇటీవల నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శిగా కొండా మాధవయ్య, కోశాధికారిగా రాజేంద్రప్రసాద్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దేవాంగ సోదరులకు ఏ అవసరం ఉన్నా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# నెల్లూరు కబుర్లు

## లింగ నిర్ధారణ చేస్తే.. కఠిన చర్యలు

➤ కలెక్టర్ హెచ్చరిక



గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, జిల్లాలో అలాంటి వాటిని అరికట్టేందుకు డెకాయ్ ఆపరేషన్స్ మరియు ఆకస్మిక తనిఖీలు ఎక్కువగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరులోని తన చాంబర్‌లో ఆయన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసిపి ఎన్‌డిటి), సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం (ఏఆర్‌టి) అమలుపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు మరింత ముమ్మరంగా నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు.

### రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌తో..

## చిన్నారులకెంతో ప్రయోజనం



జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ వల్ల ఎంతో ప్రయోజనం ఉందని, వారికి ప్రత్యేక థెరపీ ద్వారా వారిలో పలురకాల సమస్యలను నివారించవచ్చని నెల్లూరు రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, స్పాస్టిక్స్ సెంటర్ (దివ్యాంగుల కేంద్రం) కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ చెప్పారు. ఆమేరకు ఆయన ఈనెల 4న రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో తల్లితండ్రులకు అవగాహన కలిగించారు. పిల్లలు మాట్లాడడంలో అస్పష్టతగా ఉన్నా, లేదా పూర్తిగా మాటలు రాకపోయినా అలాంటి వారికి స్పీచ్ థెరపీ, నడకలో సమస్యలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ వంటివి చేయించగలిగితే ఆ పిల్లల్లో కొంతమేరకు సమస్యలు నివారించవచ్చని, వారి ప్రవర్తనలో మార్పులు కూడా గమనించ వచ్చని తెలిపారు. మానసిక వికలాంగుల కోసం అలాంటి సదుపాయాలన్నీ రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో ఉన్నాయన్నారు.

## హాకీ శతజయంతి పోస్టర్ల ఆవిష్కరణ

హాకీ ఇండియా శత జయంతి ఉత్సవాల పోస్టర్లను ఈనెల 4న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. హాకీ శత జయంతిని పురస్కరించుకుని ఈనెల 7న నగరంలో ర్యాలీ నిర్వహించి, హాకీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. డీఎస్‌డీఓ పాండురంగారావు, మాజీ డీఎస్‌డీఓ యతిరాజ్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.గురుప్రసాద్, జిల్లా హాకీ సంఘం డైరెక్టర్ థామస్, కార్యదర్శి జగన్మోహన్, హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.






## పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు



నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఈనెల 4న రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన డస్ట్‌బిన్‌లను కూడా అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి చెప్పారు. జిల్లా ప్రజా రవాణా అధికారి షమీమ్, సీటీఎం రమేష్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

## నగరంలో ఆక్రమణల తొలగింపు



నగరంలో ఎవరి చిత్తానుసారం వారు ఎక్కడ స్థలం కనపడితే అక్కడల్లా ఆక్రమించుకుని అనధికార నిర్మాణాలు చేస్తూ, రోడ్లను సైతం ఆక్రమించి కట్టడాలు కడుతున్న ప్రాంతాలను నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు గుర్తించి, వాటి తొలగింపు చేపట్టారు. ఈనెల 4న స్థానిక ఏసీ నగర్‌లోను, కొత్తూరు అంబాపురం వద్ద ఉన్న పలు ఆక్రమణలను జేసీబీ పెట్టి తొలగించారు. ప్రభుత్వ స్థలాలు, కార్పొరేషన్ స్థలాలు, రోడ్లు, కాలువలను ఆక్రమించి ఎలాంటి కట్టడాలు చేసినా తొలగింపు తప్పదని కార్పొరేషన్ కమిషనర్ నందన్ ఈ సందర్భంగా ఆక్రమణదారులను హెచ్చరించారు.

### శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో..

## కన్నులపండువగా కార్తీక పూజలు



నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో కార్తీక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో కొలువై వున్న మీనాక్షిదేవి సమేత శ్రీ సుందరేశ్వరస్వామివారికి రెండవ కార్తీక సోమవారం సందర్భంగా ఈనెల 3న ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు వెలిగించిన కార్తీక దీపాలతో ఆలయం కళకళలాడింది. అనంతరం రాత్రి 7.30 గంటలకు స్వామివారికి-అమ్మవారికి కుంభహారతులు నిర్వహించారు. ఆలయ కమిషనర్, ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

## డ్రగ్ కంట్రోల్ అధికారిగా.. హరిహరతేజ



జిల్లా ఔషధ నియంత్రణ (డ్రగ్ కంట్రోల్) శాఖ అధికారిగా డి.హరిహరతేజ ఈనెల 3న తమ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు పేరూరి ప్రదీప్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి నరేంద్ర, భాస్కర్, అశోక్, లీలామోహన్, పవన్, పాండు, శీను తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల జోలికెళ్లొద్దని నెల్లూరులోని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీహరి విద్యార్థులకు హితవు పలికారు. ఈనెల 3న స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ హజరత్తయ్య, సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### వేమిరెడ్డి శ్యామలమ్మ పేరుతో..

## విరివిగా అన్నదానాలు



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) మాతృమూర్తి వేమిరెడ్డి శ్యామలమ్మ వర్ధంతి సందర్భంగా ఈనెల 1న విపిఆర్ సిబ్బంది ఆమె పేరుతో నెల్లూరులోని పలు ప్రాంతాల్లో విరివిగా అన్నదాన కార్యక్రమాలు చేశారు. నగరంలోని ప్రగతి ఛారిటబుల్ ట్రస్ట్, బీవీనగర్‌లోని వాత్సల్య అనాథాశ్రమంలో అభాగ్యులకు అన్నదానం చేశారు. అనంతరం గీతామయి వృద్ధుల ఆశ్రమం, చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో అన్న వితరణ గావించారు.

### 'కృష్ణచైతన్య' విద్యాసంస్థల ఆధ్వర్యంలో..

## మహాశివునికి అభిషేకాలు



నెల్లూరు నగరంలోని కృష్ణచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇటీవల కార్తీక పూజలు వైభవంగా జరిగాయి. ఆ విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ పర్వతరెడ్డి రాణాప్రమోద్‌రెడ్డిలు తమ కుటుంబసభ్యులు, కళాశాల సిబ్బందితో కలిసి ఇటీవల మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరాలయంలో మహాశివునికి అభిషేకాలు నిర్వహించారు. చిలుక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, ఆలయంలో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా చిలుక ఏకాదశిని పురస్కరించుకొని.. తమ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో మహా శివునికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నామన్నారు. భగవంతుని కృపాకటాక్షాలతో అందరూ హాయిగా ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు.

## చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

చిన్నబజారు సీఐ కోటేశ్వరరావు



విద్యార్థి దశ నుంచే అందరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, అందువల్ల మంచేదో- చెడు ఏదో తెలుస్తుందని చిన్నబజారు సీఐ చిట్టెం కోటేశ్వరరావు చెప్పారు. ఈనెల 4న ఆయన నెల్లూరు జెండావీధిలోని పీఎస్ఎం స్కూల్‌లో విద్యార్థినులకు చట్టాల గురించి తెలియజెప్పారు. ప్రత్యేకించి బాలికల రక్షణ చట్టాలను విద్యార్థినులకు అర్థమయ్యేలా వివరించారు. మీ పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్‌కి పాల్పడినా వెంటనే తల్లితండ్రులకు తెలియజేయాలని, స్థానికంగా ఉండే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర వేళల్లో 112 నంబరుకు కాల్ చేస్తే వెంటనే రక్షణ కల్పించడంతో పాటు, నిందితులపై చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, మోసకారుల మాటలు నమ్మి జీవితాలు నాశనం చేసుకోవద్దని, బాగా చదువుకుని విద్యార్థినులంతా ఉన్నతస్థానాల్లో రాణించాలని తెలిపారు.



## 'డా. రేవూరు'కి.. జానమద్ది పురస్కారం

ప్రముఖ సాహితీవేత్త జానమద్ది హనుమచ్ఛాస్త్రి శత జయంతి సాహితీ పురస్కారాన్ని డా. రేవూరు అనంత పద్మనాభరావుకి ప్రదానం చేశారు. నవంబర్ 2న కడపలోని సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆయనకి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి ప్రతాప విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## • పురపాలక మంత్రి నారాయణ



రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు 4వ డివిజన్ కిసాన్ నగర్, 3వ డివిజన్ సింహపురి కాలనీలో పర్యటించి, లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పెన్షన్లను పంపిణీచేశారు.అనంతరం పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన 118 మంది తుఫాన్ బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకులను మంత్రి స్వయంగా పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన 62 లక్షలా 886 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 69 మంది లబ్దిదారులకు మంత్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతినెలా ఒకటో తేదీన పండుగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ జరుగుతోందని, పెన్షన్‌దారుల కళ్ళలో ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు.

### పెరమన బాధితులను ఓదార్చిన మంత్రి

సంగం మండలం పెరమన జాతీయ రహదారిపై గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను మంత్రి నారాయణ ఓదార్చారు. కారును ఇసుక టిప్పర్ డీ కొట్టిన దుర్ఘటనలో నెల్లూరులోని గుర్రాలమడుగు సంఘానికి చెందిన శేషం షరమ్మ, శేషం బాలవెంగయ్యలు ప్రాణాలు కోల్పోయారు. ఘటన జరిగిన తర్వాత మంత్రి మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించారు.. ఈ నేపథ్యంలో ఇటీవల ఆ మృతుల కుటుంబాలను మంత్రి నారాయణ పరామర్శించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.






# పేదల కంటివెలుగు.. 'విపిఆర్ నేత్ర'

## మరో మహోన్నత సేవా కార్యక్రమానికి వేమిరెడ్డి దంపతుల శ్రీకారం





***జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఎంతోకాలం నుంచి ఎన్నో ధార్మిక కార్యాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు కోట్లాది రూపాయల సొంత ధనాన్ని వెచ్చిస్తూ, మాధవసేవ-మానవసేవలతో తరిస్తున్న నెల్లూరు ఎంపీ ..'సేవాభూషణులు' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) తాజాగా ప్రజల కోసం..ముఖ్యంగా కంటిచూపు సరిగా లేనివారికోసం ఒక మహోన్నత మానవీయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దాని పేరే..'విపిఆర్ నేత్ర'. పేదలకు కార్పొరేట్ విద్యనందిస్తూ 'విపిఆర్ విద్య', గ్రామీణ ప్రాంతాల ప్రజల దాహార్తి తీరుస్తూ 'విపిఆర్ అమృతధార' వంటి అనేకానేక బృహత్తర కార్యక్రమాలను తమ 'విపిఆర్ ఫౌండేషన్' ద్వారా ఆచరణలో పెట్టిన విపిఆర్, తమ సేవల్లో భాగంగా కంటిరోగుల కోసం 'విపిఆర్ నేత్ర'ను కూడా ప్రారంభించడం పట్ల జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి సంతోషం వ్యక్తమవుతోంది. వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో విపిఆర్, ఆయన సతీమణి.. తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లతో కలసి వారు ఆ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారు.***

కంటి చూపు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతూ, కంటి సమస్యలతో బాధపడేవారి జీవితాల్లో వెలుగు ప్రసాదించాలన్న ఆశయంతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తమ విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 'విపిఆర్ నేత్ర' సేవా కార్యక్రమాన్ని ప్రారంభించడంతో జిల్లాలో ఎంతోమంది నిరుపేద కంటిరోగులకు ఆ కార్యక్రమం ఒక పెద్ద ఆసరాగా మారింది. ఇప్పటికే పేదలకు, దీనులకు, అనాథలు అసహాయులకు, బడుగు బలహీనవర్గాల వారి సంక్షేమానికి కోట్లాదిరూపాయలను ఖర్చుచేస్తూ విశేష సేవలందిస్తున్న విపిఆర్, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలసి, ప్రజలకు కంటివెలుగుగా 'విపిఆర్ నేత్ర'ను రూపుదిద్దడం అపూర్వం! అందుకోసం ఒక బస్సునే ఏర్పాటుచేసి, అందులో కంటిరోగుల సమస్యలు పరిశీలించేందుకు, అవసరమైనవారికి కంటి అద్దాలను కూడా ఉచితంగా అందజేసేందుకు ఈ బస్సులో ఏర్పాట్లు చేయడం విశేషం.

### ప్రజాసేవ కోసమే..'విపిఆర్ ఫౌండేషన్'

**- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**

విపిఆర్ సతీమణి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, ప్రజాసేవ చేయాలన్న ఉన్నతమైన ఆశయంతో 2015లో 'విపిఆర్ ఫౌండేషన్' ప్రారంభించామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ 'విపిఆర్ అమృతధార' ఫ్లోరైడ్ బాధిత ప్రజలున్న ఉదయగిరి నుంచే ప్రారంభించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 2వందలకు పైగా వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేశామన్నారు. విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం, విపిఆర్ వికాసం లాంటి పలు ప్రాజెక్టుల ద్వారా సమాజంలో వివిధ వర్గాలకు సేవలందిస్తున్నామన్నారు. కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వేలమంది మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించామని, అందులో దాదాపు వెయ్యి మందికి క్యాన్సర్ ప్రాథమిక దశలో ఉన్నట్టు ముందుగానే గుర్తించబట్టి వారందరికీ మెరుగైన చికిత్సలు అందించి క్యాన్సర్ నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు.

### కంటిచూపు లేకుంటే..అంతా అంధకారమే

**- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

కంటి చూపు లేకుంటే జీవితమంతా అంధకారమేనని, అందుకే 'విపిఆర్ నేత్ర' ద్వారా కంటి సమస్యల నివారణకు కృషిచేస్తున్నామని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలపై అవగాహన లేక ఎంతో మంది తమ చూపును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగడానికి నీరు, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో బతికేందుకు ట్రై సైకిల్స్, పేద పిల్లలు చదువుకునేందుకు విపిఆర్ విద్య వంటివి ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ప్రజలకు ఇంకా ఏదో చేయాలన్న తపన నుంచి విపిఆర్ నేత్ర కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించామని, తనకు ఎంతో ఇష్టమైన ఉదయగిరి ప్రాంతం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎంతో ఉన్నత ఆశయంతో చేపట్టిన విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.






## ముగ్గురిని మింగేసిన.. మైపాడు బీచ్

సముద్రంలో ఈతకు దిగిన ముగ్గురు స్నేహితుల్ని మృత్యువు కాటేసింది. ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్‌లో ఈనెల 2న ఈ దుర్ఘటన జరిగింది. ఆరోజు ఆదివారం సెలవు కావడంతో సరదాగా గడిపేందుకు ముగ్గురు యువకులు బీచ్‌కి వచ్చి సముద్రంలోకి దిగారు. కాసేటికే అలల ధాటికి సముద్రంలో గల్లంతయ్యారు. ఆ సమాచారం తెలిసిన వెంటనే మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేటకి చెందిన పఠాన్ మహమ్మద్ తాజీమ్(17), నెల్లూరు నగరంలోని కోటమిట్టకి చెందిన పఠాన్ హుమయూన్ (17), సమీద్(17)ల మృతదేహాలను గాలించి వెలికితీశారు. వీరు ముగ్గురూ నారాయణ కాలేజీలో ఇంటర్ చదువుతున్నారు. ఆ ముగ్గురినీ గుర్తించి, వారి తల్లితండ్రులకు పోలీసులు సమాచారం అందించారు. చేతికి అందివస్తారనుకున్న కుమారులు ఇలా అకాల మృత్యువు వాతపడడంతో వారి రోదన అంతా ఇంతా కాదు. ఇందుకూరుపేట సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి, కేసు దర్యాప్తు ప్రారంభించారు.

## ఇన్‌చార్జి జడ్పీ సీఇఓగా..డీపీఓ

జడ్పీ సీఈఓ మోహన్‌రావు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు విజయవాడలోజరిగే శిక్షణకు వెళ్తున్న నేపథ్యంలో, ఆ స్థానంలో ఇన్‌చార్జిగా జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఎం.శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈ నెల 4న ఉత్తర్వులు జారీచేశారు.

## ఉచిత బస్సు వసతి కల్పించండి

### దివ్యాంగుల సంఘం నాయకుని వినతి

ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ వసతి కల్పించాలంటూ నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. ఈనెల 4న నెల్లూరులోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌కి వచ్చిన ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని కలిసి ఆమేరకు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగుల సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు వ్యవసాయాధికారుల సూచన

మొంథా తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు జిల్లా వ్యవసాయ అధికారిణి పి.సత్యవాణి ఈనెల 2న ఒక ప్రకటనలో సూచనలు చేశారు. ప్రతి రైతు విధిగా పంట నమోదు చేసుకుని, ఆధార్‌కి బ్యాంకు ఎన్‌పీసీఐ లింక్ చేసుకుని ఉండాలని, అప్పుడే పంట నష్టం వివరాల నమోదుకు వీలవుతుందని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి నష్టాల వివరాలు నమోదు చేస్తున్నారని, 33 శాతం కన్నా ఎక్కువగా పంటనష్టం జరిగిన రైతులు, వెంటనే రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులను కలిసి ఆ వివరాలు చెప్పి, యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు సేవాకేంద్రాల్లో ప్రదర్శించడం జరుగుతుందని కూడా ఆమె తెలిపారు.

## సైడుకాలువల ఏర్పాటుకి సీపీఎం విజ్ఞాపన

నెల్లూరు నగరంలోని 16వ డివిజన్‌లో ఉన్న 4,5,6,7 వీధుల్లో సైడు కాలువలు లేకపోవడం వల్ల సమస్యగా ఉందని, దీంతో అక్కడ అపార్ట్‌మెంట్‌లలో నివసిస్తున్నవారికి డ్రైనేజీ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకుడు కాయం శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 4న నగర కార్పొరేషన్ కమిషనర్ వైఓ నందన్‌కి స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో దోమలు పెరిగిపోయాయన్నారు. వెంటనే కార్పొరేషన్ అధికారులు పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక నాయకులు రవి, చౌదరి, సుధాకర్, రాజేష్, వెంకి, హర్ష పాల్గొన్నారు.

# రహదారిపై నెత్తురు-ఎవరి నిర్లక్ష్యం?




హైదరాబాద్ – బెంగుళూరు జాతీయ రహదారిపై ఇటీవల ప్రైవేట్ స్లీపర్ బస్సులో మంటలు చెలరేగి ప్రయాణికులు సజీవదహనం అయిన ఘోర దుర్ఘటన మరువకముందే, రంగారెడ్డి జిల్లా తాండూరు–చేవెళ్ల మార్గంలో ఆర్టీసీ బస్సును టిప్పర్ లారీ ఢీకొట్టిన హృదయవిదారక ఘటన జరిగింది. ఈ రెండు ఘోర ప్రమాదాల్లో దాదాపు 40మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అందరి హృదయాలను కలచివేసింది. ఈ వరుస విషాదాలు కేవలం 'ప్రమాదాలు'గా కొట్టిపారేయలేనివి. ఇవి మన రవాణా వ్యవస్థ, రోడ్డు భద్రతా విధానం మరియు అధికారుల తీవ్రమైన నిర్లక్ష్యానికి నిదర్శనాలు.

### పెరుగుతున్న ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోందని కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ తాజా గణాంకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో 2023 నుండి 2024 మధ్య కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ(సుమారు 19,949 నుండి 19,557), మరణాలు మాత్రం పెరిగాయి. 2024లో ఏపీలో దాదాపు 8,346 మరణాలు నమోదయ్యాయి. అంటే, ప్రమాదం జరిగితే బతికే అవకాశం తక్కువగా ఉంది. తెలంగాణలో ప్రమాదాల తీవ్రత 2024లో కొంత తగ్గినా, ఇప్పటికీ దాదాపు 30.59% ప్రమాదాలు ప్రాణాంతకంగానే ఉంటున్నాయి. గత 11 ఏళ్లలో తెలంగాణలో రోడ్డు ప్రమాదాల్లో 86 వేల మందికి పైగా మృతి చెందారు. ప్రతి మరణం వెనుక ఒక కుటుంబం, ఒక జీవితం ఉందని మనం గుర్తించాలి.

### ప్రమాదాలకు మూలకారణాలు, లోపాలు ఎక్కడ?

ప్రతి పెద్ద ప్రమాదం తర్వాత విచారణలు జరుగుతాయి, కానీ మూలకారణాలు మాత్రం మారడం లేదు. ఈ రెండు ఘటనలు మన వ్యవస్థలో ఉన్న ముఖ్యమైన లోపాలను బయటపెట్టాయి.

దేశవ్యాప్తంగా దాదాపు 70% ప్రాణాంతక ప్రమాదాలకు అతివేగమే కారణం. డ్రైవర్లు రాత్రి వేళల్లో విశ్రాంతి లేకుండా నడపడం, మద్యం సేవించి డ్రైవ్ చేయడం ప్రమాద తీవ్రతను పెంచుతున్నాయి.

స్లీపర్ బస్సుల్లో అత్యవసర నిష్క్రమణ మార్గాలు సరిగా లేకపోవడం, మండే పదార్థాలు సులభంగా మంటలకు కారణమయ్యే విధంగా వాహన నిర్మాణం ఉండటం ప్రైవేట్ బస్సుల భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. తాండూరు–చేవెళ్ల రోడ్డు వంటి అనేక జాతీయ రహదారులు నేటికీ ఇరుకైనవిగా, డివైడర్లు లేకుండా ఉన్నాయి. బ్లైండ్ టర్న్‌లు, తగిన లైటింగ్ లేకపోవడం, అతిగా లోడ్ అయిన భారీ వాహనాలను నియంత్రించే వ్యవస్థ లేకపోవడం ఘోర విషాదాలకు దారితీస్తోంది. ఓవర్ లోడ్‌తో టిప్పర్ లారీలు ప్రమాదకరంగా తిరుగుతున్నా పట్టించుకునే అధికారులు లేరు. ఆర్టీసీ బస్సుల్లో అధిక రద్దీ ప్రమాదాల తీవ్రతను పెంచుతోంది.

### తక్షణ చర్యలు ఏం తీసుకోవాలి?

కేవలం పరిహారాలు ప్రకటించడం, తాత్కాలిక సస్పెన్షన్‌లు పరిష్కారం కాదు. రోడ్డు భద్రత అనేది శాశ్వత విధానంగా మారాలి. ఘోరప్రమాదాలు జరిగిన ప్రతిసారి అధికారులు దర్యాప్తు చేయడం, ఎవరి తప్పు అని తేల్చడంతోనే సరిపెడుతున్నారు. నివారణ మార్గాలపై దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వం వ్యవస్థ జవాబుదారీతనం తీసుకోవడం లేదు. ఒక డ్రైవర్ తప్పు చేశాడంటే, అతనికి లైసెన్సు లేదంటే, వాహనం సరిగా లేదంటే, ఆ బాధ్యత కచ్చితంగా ప్రభుత్వ వ్యవస్థదే. ఈ జవాబుదారీతనం తీసుకోకుండా వ్యక్తుల మీదకు తప్పును నెట్టేయటం సరికాదు.

స్పీడ్ లిమిట్ ఉల్లంఘనలపై భారీ జరిమానాలు విధించాలి. భారీ వాహనాలకు (ముఖ్యంగా టిప్పర్లకు) ఓవర్‌లోడింగ్‌ను పూర్తిగా నిషేధించాలి. రాత్రి వేళల్లో తనిఖీలు నిరంతరంగా చేపట్టాలి.

### డ్రైవర్లకు శిక్షణ ఉండాలి!

డ్రైవర్లకు, ఫిట్‌నెస్, అలసట నిర్వహణ మరియు అత్యవసర పరిస్థితులపై (Fire Safety) తప్పనిసరి శిక్షణ ఇవ్వాలి. బస్సులలో డ్రైవింగ్‌ను పర్యవేక్షించే కెమెరా/డ్రైవర్ అలర్ట్‌నెస్ సిస్టమ్స్ తప్పనిసరి చేయాలి. రాత్రివేళ డ్రైవింగ్‌లో తాము నిద్రలోకి జారుకుంటున్నట్లు ఇటీవల జరిగిన ఒక సర్వేలో ఎక్కువమంది డ్రైవర్లు చెప్పారు. రాత్రి వేళల్లో ప్రయాణించే ప్రజా రవాణా వ్యవస్థల్లో దూరాన్ని బట్టి తప్పనిసరిగా ఇద్దరు డ్రైవర్లు ఉండేలా కఠినంగా నియమ నిబంధనలను అమలు చేయాలి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే 'బ్లాక్‌స్పాట్'లను గుర్తించి, వాటిని తక్షణమే మెరుగుపరచాలి. రోడ్డు డివైడర్లు, తగిన లైటింగ్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలి. ప్రైవేట్ బస్సుల భద్రతా ధృవీకరణ (Fitness Certification) మరింత కఠినతరం చేయాలి.



ఇకనైనా ప్రభుత్వాలు, రవాణా అధికారులు మేల్కోవాలి. లేదంటే, మన కళ్లముందే ఈ రోడ్డు మారణహోమం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుంది. అమాయక ప్రజల ప్రాణాల కంటే ఎక్స్‌గ్రేషియా ఎక్కువ కాదని గుర్తించాలి. సురక్షితమైన ప్రయాణం అనేది ప్రతి పౌరుడి హక్కు. ఈ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే!..

**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**




## సమస్యల సాధన కోసం.. మునిసిపల్ కార్మికుల ఆందోళన

సమ్మె కాలంలో జీతం ఇస్తామని నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఈనెల 4న నెల్లూరులో మునిసిపల్ కార్మికులు ఆందోళన చేశారు. నగర కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు పెంచలనరసయ్య, మనోజ్‌కుమార్ మాట్లాడుతూ, సమ్మె రోజుల్లో 14 రోజుల జీతం ఇచ్చేందుకు సమ్మతించిన నేతలు నేటికీ ఆ విషయం పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు ఉద్యోగ విరమణతో పాటు, వారికి రావాల్సిన ఆర్థిక సదుపాయాలను కూడా అందించాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాల వారసులకి ఉద్యోగ అవకాశాలివ్వాలని కూడా వారు కోరారు. సీపీఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన రోడ్లు భవనాల శాఖ ఉద్యోగులు

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రోడ్లు భవనాల శాఖ ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఈనెల 4వ తేదీ నాటికి వారి నిరసనలు 4వ రోజుకి చేరాయి. నెల్లూరులోని ఆర్అండ్‌బీ సర్కిల్ కార్యాలయం వద్ద వారు మంగళవారం భోజన విరామ సమయంలో నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని, ఉద్యోగులందరికీ ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌ను వర్తింపజేయాలని, టెక్నికల్ ఉద్యోగులకు బీపీఓ పోస్టుల నుంచి ట్రేసర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని తదితర డిమాండ్లతో వారు ఆందోళన నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు శరత్‌బాబు, ఎస్ఎం రత్నం, కె.శంకర్‌బాబు, షబ్బీర్ అహ్మద్, సురేష్‌బాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలివ్వాలంటూ.. పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

రోజువారీ పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్న తమకు కనీస వేతనాలను అమలుచేయాలని, జీతాలు పెంచి ప్రతినెలా ఆ జీతాలు సక్రమంగా అందేలా చూడాలని కోరుతూ కావలి పట్టణంలో సీఐటీయు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు ధర్నాందోళన చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాపూరు సునీల్ మాట్లాడుతూ, కావలిలో సుమారు వందమంది రోజువారీ పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారని, కొంతమంది పదేళ్లుగా ఈ పనులు చేస్తున్నా వారికి నెలకి 10వేలకి మించి జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. కార్మికులకి ప్రభుత్వ సెలవులు కానీ, కార్మిక చట్టాలు కానీ అమలుచేయడం లేదని, దీంతో స్వల్ప వేతనాలతో కార్మికులు కుటుంబ పోషణకోసం అవస్థ పడాల్సివస్తోందన్నారు. వృత్తిపరంగా అందించాల్సిన యూనిఫామ్, సబ్బులు, నూనె, ఇతర వస్తువుల కూడా వీరికి ఏమీ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కార్మికులందరినీ ఆప్కాస్‌లోకి తీసుకుని, వారికి పనిభద్రత కల్పించాలని ఆయన కోరారు. ఈ ఆందోళనలో సీఐటీయు కావలి పట్టణ అధ్యక్షుడు తిరుపాలు, యూనియన్ నాయకులు జె.బాబు, రమేష్, పోలయ్య, శీనయ్య, జేమ్స్‌తో పాటు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ విద్యుత్ ఉద్యోగుల వినతి

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు తీర్చాలంటూ జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఈనెల 4న నెల్లూరుకు వచ్చిన ఎంఎస్ఎంఇ ఛైర్మన్ శివశంకర్‌రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకుడు సోమశేఖర్ మాట్లాడుతూ, విద్యుత్‌ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు ఏళ్ల తరబడిగా పెండింగ్‌లోనే ఉన్నాయని, ప్రభుత్వం ఇకనైనా పట్టించుకుని వాటి పరిష్కారానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సూర్యప్రకాష్, మల్లికార్జున, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ షిరిడీ సాయినాథుని పాదుకలకు పూజలు



షిరిడీలోని శ్రీ సాయిబాబా దేవాలయం నుంచి తీసుకువచ్చిన శ్రీ షిరిడీ సాయినాథుని పాదుకలకు అల్లూరులో మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి-శివప్రియ దంపతులు మంగళవారం నాడు పూజలు నిర్వహించారు. వారి విజ్ఞప్తి మేరకు షిరిడీ సాయి సంస్థానం వారు షిరిడీ నుంచి శ్రీ సాయినాథుని పాదుకలను అల్లూరుకు తీసుకువచ్చి భక్తులందరికీ దర్శనభాగ్యం కల్పించారు. గత బుధవారం నుంచి ఈనెల 4 మంగళవారం దాకా కాటంరెడ్డి నివాసంలో శ్రీ సాయినాథుని పాదుకలకు వైభవంగా పూజలు, హారతులు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సాయినాథుని పాదాలను దర్శించుకుని తరించారు. అశేషభక్తుల ఆరాధ్యదైవమైన శ్రీ సాయినాథుని విశిష్టతను-మహిమలను ఈ సందర్భంగా స్వామివారి భక్తులు సుబ్రహ్మణ్యంరెడ్డి అందరికీ వివరించారు. కాటంరెడ్డి కుటుంబసభ్యులు చేవూరి సూర్యనారాయణరెడ్డి, సౌజన్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సిసి క్యాడెట్ల.. రాష్ట్రీయ ఏక్తా దివస్




నెల్లూరు, వెంగళరావునగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, కెవిఆర్ హైస్కూళ్లలో ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్‌లు గుండాల నరేంద్రబాబు, సీవీ నాగరాజుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కుమనిషి..సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం జరిగింది. కరెంట్ ఆఫీస్ కూడలి వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విఎస్‌యు వైస్‌చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు, ఎన్‌సిసి పిఐ స్టాఫ్ ఆఫీసర్ లక్ష్మణకుమార్, థర్డ్ ఆఫీసర్ డి.పెంచలయ్య పాల్గొన్నారు.

## రైతు బజార్లను ఉపయోగించుకోండి

**జేసీ వెంకటేశ్వర్లు**

నెల్లూరులోని రైతుబజార్లలో చాలా దుకాణాలు ఖాళీగానే ఉన్నాయని, వీధి వ్యాపారులు వీటిని ఉపయోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఈనెల 4న ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మార్కెటింగ్‌శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ, నగర కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతూ, ఫత్తేఖాన్‌పేట రైతుబజారులో ఉన్న ఖాళీ దుకాణాలను వీధి వ్యాపారులు అద్దెకు తీసుకుని సద్వినియోగం చేసుకునేలా వారిలో అవగాహన కలిగించాలని చెప్పారు. దీంతో ట్రాఫిక్‌కి కూడా కొంత సమస్య తగ్గుతుందన్నారు. నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేటల్లో ఉన్న వీధి వ్యాపారులను నవాబుపేటలోని రైతుబజారుకు తరలించడం వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## బాధ్యతలు చేపట్టిన.. డీఎస్‌డీఓ

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ)గా ఉన్న యతిరాజ్ ఉద్యోగ విరమణ చేయడంతో, ఆ స్థానంలో కొత్తగా నియమితులైన పాండురంగారావు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈనెల 4న పాండురంగారావు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# దేశభద్రతకు పునాది.. సర్దార్ వల్లభాయ్



**కొనియాడిన బీజేపీ నేత సురేంద్రరెడ్డి**

దేశభద్రతకు పునాది వేసిన సర్దార్ వల్లభాయ్‌పటేల్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా ఇటీవల నెల్లూరులో జరిగిన వల్లభాయ్‌పటేల్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆ మహనీయుని ఆలోచనలతోనే భారత్ ఏక్తా పునర్నిర్మాణం సాధ్యమైందని ఆయన కొనియాడారు. తొలుత స్థానిక విఆర్‌సి సెంటర్ నుంచి పటేల్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. విఎస్‌యు వైస్‌చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ నందన్, యువజన అధికారి మహేంద్రరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయశంకర్, సెట్నెల్ సీఇఓ నాగేశ్వరరావు, మేనేజర్ శ్రీనివాసులు, ఆర్ఐఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీలో.. కారుణ్య నియామకాలు



నెల్లూరు జిల్లా పరిషత్‌లో ఇటీవల జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో నలుగురికి కారుణ్య నియామకాల ద్వారా ఆఫీస్ సబార్డినేట్‌లుగా ఉద్యోగావకాశాలు కల్పించారు. అదేవిధంగా, అయిదురు సీనియర్ సహాయకులకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతి కలిగించారు. తను జడ్పీ ఛైర్‌పర్సన్ అయిన 2021 సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు జడ్పీ పరిధిలో 98 మందికి కారుణ్య నియామకాలు, 160 మందికి ఉద్యోగోన్నతులు కల్పించినట్లు ఈ సందర్భంగా అరుణమ్మ చెప్పారు. ఇప్పటివరకు ఉన్న ఖాళీ పోస్టులను కూడా త్వరితగతిన భర్తీ చేస్తున్నామని ఆమె తెలిపారు.

---

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# జిల్లా స్థాయి క్రీడల్లో రాణించాలి



జిల్లా స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో గూడూరు డివిజన్ స్థాయి క్రీడాకారులు రాణించి డివిజన్‌కు గుర్తింపు తీసుకురావాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గూడూరు డివిజన్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హాజరై క్రీడాజ్యోతిని వెలిగించారు. నూతనంగా డీఎస్పీ ద్వారా ఉద్యోగాలు పొందిన పిఈటీలను పరిచయం చేసుకుని అభినందించారు. డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్, ఎంఈఓ కాంచన, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# మహాసభలను జయప్రదం చేయండి

**- సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య -**



డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సి.ఐ.టి.యు అఖిల భారత18వ మహాసభలను జయప్రదం చేయాలని ఈ నెల 4న గూడూరు, సిఐటియు కార్యాలయంలో జరిగిన మార్కెట్ ఆటో స్టాండ్ జనరల్ బాడీ సమావేశంలో సి.ఐ.టి.యు ఆటో యూనియన్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య పిలుపునిచ్చారు. ఆటో కార్మికులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మహాసభలకు విరాళాలందజేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా బి.రమేష్, ఉపాధ్యక్షులుగా బల్లి పెంచలయ్య, కార్యదర్శిగా యం.అర్జున్, సహాయ కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, ట్రెజరర్‌గా ఎస్.డి.ఖాదర్‌బాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.



# బ్రాహ్మణ సేవాసంఘ 'రుద్రాభిషేకం'

గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కళ్యాణ మండపంలో కార్తీక మాసం ద్వాదశి సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు, రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత ఆలూరు శిరోమణిశర్మ ఆధ్వర్యంలో మహాశివునికి రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం వనభోజనాలు ఏర్పాటు చేశారు. సంఘ అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ ప్రతి కార్తీక మాసం సందర్భంగా తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా రుద్రాభిషేకం, వనభోజనాలు ఏర్పాటు చేశామని, పూజా కార్యక్రమాలలో పాల్గొన్న బ్రాహ్మణులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కడివేటి రామ్మూర్తి, విద్యాలలిత, చిట్టమూరు శ్రీనివాసరావు, పురుషోత్తంరావు, డివి శ్రీనివాసరావు, నరసింహారావు, వెంకటేశ్వరరావు, చెన్నూరు విద్యావతి, అనిమెళ్ళ రాజేశ్వరిదేవి, శ్రీనివాస్‌కుమార్, అశోక్ కుమార్, నారాయణమూర్తి, వెంకటసుబ్బారావు, రాజా నారాయణ, చైతన్యప్రసాద్, వంశీకృష్ణ, ప్రసన్నకుమార్, శివప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు స్వచ్ఛతకు కృషి చేయాలి

ప్రతి ఒక్కరు స్వచ్ఛతకు కృషిచేయాలని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గూడూరు పురపాలక సంఘ కౌన్సిల్ హాల్‌లో పురపాలక సిబ్బందికి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వారిచే ఒకరోజు సామర్థ్యాల పెంపు స్కిల్‌డెవలప్‌మెంట్ ట్రైనింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ చెత్త నుండి సంపద పొందవచ్చునని, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు నిబద్ధతతో అభ్యసించాలని కోరారు. అందరూ బాధ్యత వహిస్తే స్వచ్ఛ గూడూరు సాధించవచ్చన్నారు.

# పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



యువత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి అన్నారు. గూడూరు సమీపంలోని జాతీయ రహదారి కూడలి నుండి గడియారపు స్తంభం కూడలి వరకు పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇటీవల 2కే రన్ నిర్వహించారు. సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, ఎస్సైలు తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం రాజు, షాజహాన్, పవన్, బలరామయ్య పాల్గొన్నారు. కాగా, నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా కూడలి నుంచి 2కే రన్ నిర్వహించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, ఎంఆర్వో మునిరత్నం, సీఐలు బాబీ, సంగమేశ్వరరావు, కమిషనర్ ఎస్.కే ఫజులుల్లా, ఎస్సైలు శ్రీకాంత్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

# విద్యార్థులకు చెకుముకి పోటీలు




గూడూరు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన యం.ఈ.ఓ. కాంచన బాలకృష్ణం రాజు మాట్లాడుతూ విద్యార్థులలో చిన్నతనం నుండే సైన్స్ పట్ల అవగాహన కల్పించాలని, తద్వారా మూఢనమ్మకాలను పోగొట్టవచ్చన్నారు. ఇటువంటి పోటీ పరీక్షల ద్వారా జే.వి.వి వారు విద్యార్థులను చైతన్యం చేయడం అభినందనీయమని తెలిపారు. జే.వి.వి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ అభివృద్ధి అభినందనీయం!

## - యుఎన్ విజన్ దౌత్యవేత్త



మాస్కోలోని ఇంటర్నే షనల్ సెంటర్ ఫర్ సైంటి ఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫ ర్మేషన్ (ఐసీఎస్టీఐ) నిపుణుడు, యుఎన్ విజన్ దౌత్యవేత్త జయరాములు లింగుట్ల ఈనెల 3న ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతల గురించి వివరించారు. ఈ సందర్భంగా, శ్రీసిటీ వేగ వంతమైన అభివృద్ధిని జయరాములు ప్రశంసించారు. 31 దేశాలకు చెందిన 245కి పైగా సంస్థలు శ్రీసిటీలో స్థాపించబడటాన్ని ఆయన అభినందించారు.

# డాక్టర్ రజనీకాంత్‌కి అత్యున్నత అవార్డు



మద్రాసులోని గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్‌లో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విభాగంలో సేవలందిస్తున్న డాక్టర్ పచ్చా రజనీకాంత్‌ని తమిళ నాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి అత్యున్నత అవార్డుతో సత్కరించారు. దక్షిణ భారతదేశంలోనే లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగంలో అత్యుత్తమ సేవలందిస్తున్నందుకు గుర్తుగా ఈ అవార్డుతో ఆయనని సత్కరించారు. నవంబర్1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా, చెన్నై రాజ్‌భవన్‌లో జరిగిన వేడుకలలో ఈ అవార్డుని డాక్టర్ రజనీకాంత్ అందుకున్నారు. తమిళనాట తెలుగువారి తలైవర్ డాక్టర్. సి.యం.కే.రెడ్డి కూడా ఈ సంబరాలలో ప్రధానఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ రజనీకాంత్‌కి 'లాయర్' శుభాకాంక్షలు.


# కల్యాణ వైభవం...!




నెల్లూరు వాస్తవ్యులు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిల కుమారుడు

**సాయి చేతన్‌రెడ్డి - నిహారికారెడ్డి**

(చింతారెడ్డిపాళెం వాస్తవ్యులు ముచ్చల మధుసూదన్‌రెడ్డి - దేవసేనల కుమార్తె)ల పరిణయం నవంబర్ 2వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకి 'లాయర్' శుభదీవెనెలు.




నెల్లూరు వాస్తవ్యులు సామంతు శ్రీధర్‌రెడ్డి - లక్ష్మి శిరీషల కుమార్తె

**లాస్య - విషాల్ వల్లభ్**

(హైదరాబాద్ వాస్తవ్యులు పనుగూరు సురేష్‌రెడ్డి - లలితల కుమారుడు)ల వివాహం అక్టోబర్ 31వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. నవ దంపతులకి 'లాయర్' శుభాభినందనలు.




నెల్లూరు వాస్తవ్యులు రావుల శ్రీనివాస్‌గౌడ్ - కళ్యాణ సౌమ్యల కుమారుడు

**అనిష్ - తక్షిత**

(పి.అంబరిష్ - మీనాక్షి హెచ్.ఎన్‌ల కుమార్తె)ల పెళ్లి అక్టోబర్ 30వ తేదీ బెంగళూరులో వైభవంగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాకాంక్షలు.

# నాలుగోసారి ప్రసన్న వెంకటేశ్వరుని సేవలో రామమోహన్





గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం ఈనెల 5వ తేదీ జరిగింది. గూడూరు ఎమ్మెల్యే డా. పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన పాలకమండలి ఛైర్మెన్‌గా 4వసారి శ్రీకంటి రామమోహన్‌రావు, సభ్యులుగా మంగళపూరి గోపాల్, పర్వతాల శివరంజని, గుడి మంజులమ్మ, ఆరుమూళ్ళ శ్రీరంగనాథ్, ఓబిలి బాబు, అమరయ్యానాయుడు, ఉప్పు సుజన, కొమ్మ రవీంద్రబాబులచే కార్యనిర్వహణాధికారి ముసుమూరి రవికృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, సభ్యులు కడివేటి రామమూర్తి, చిట్టమూరు శ్రీనివాసరావు, డి.బి.శ్రీనివాస్, లలితమ్మ, నరసింహం తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.

# ఓం నమ:శివాయ!.. నమో!.. శ్రీ మహాదేవాయ!

- ఆలయాల్లో మార్మోగిన 'శివ'నామం
- కార్తీక దీపకాంతులతో ఆలయాలు కళకళ!





***కార్తీకమాసం..అందులోనూ కార్తీకపౌర్ణమి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు శివనామ స్మరణలతో మార్మోగాయి. కార్తీ దీపాల కాంతులతో శివకేశవాలయాలు కళకళలాడాయి. 'ఓం నమ:శివాయ' నామజపంతో భక్తులు తరించిపోయారు. ఆ మహాదేవుని తలచుకుంటూ నదీస్నానాలు, సముద్రస్నానాలతో అనేకప్రాంతాల్లోని భక్తజనం పులకించిపోయారు. సాగరతీరాల్లో సైకతలింగాలకు పూజలు చేశారు. అనేక శైవక్షేత్రాల్లో విశేష పూజలు, అభిషేకాలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు వైభవోపేతంగా జరిగాయి. ఆదిదేవునికి నమస్కరిస్తూ ఆకాశదీపాలు వెలిగించి ఆ దీపకాంతుల్లో మురిసిపోయారు.***

కార్తీక పున్నమి సందర్భంగా ఈనెల 5వ తేదీ బుధవారం నాడు ఆలయాలు భక్తజనంతో క్రిక్కిరిసి పోయాయి. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసుకునేందుకు మహిళాభక్తులు వేల సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా పెంచలకోనలో శ్రీ లక్ష్మీనృసింహస్వామికి గరుడోత్సవం నిర్వహించారు. నందనవనంలో ఉసిరిచెట్టు వద్ద దీపారాధనలు చేశారు. సహస్రకలశాభిషేకం, హోమాలు చేశారు. సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా శైవాలయాల్లోనూ విశేష పూజలు, విశిష్ట సేవలు జరిగాయి. జొన్నవాడ కామాక్షితాయి అమ్మ వారి దేవాలయంలో జ్వాలాతోరణం కార్యక్రమాన్ని దేదీప్యమానంగా నిర్వహించారు. సిద్ధేశ్వరకోన వద్ద నదీస్నానాలు ఆచరించి కార్తీకదీపాలు వెలిగించి నదిలో వదిలారు. రామతీర్థంలోని శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరాలయం, కోటితీర్థంలోని శ్రీ కోటేశ్వరస్వామి దేవాలయం, కొడవలూరులోని శ్రీ ఉదయకాళేశ్వరాలయం, మైపాడు శివాలయం.. కాటేపల్లి శివాలయం, కృష్ణపట్నంలోని కామాక్షిదేవి సమేత శ్రీ సిద్ధేశ్వరస్వామి దేవాలయం, కాకుటూరులో దుర్గాభవాని సమేత శ్రీ అభయ లింగేశ్వరాలయం, కలువాయిలోని శ్రీ నీలకంఠేశ్వరాలయం, కుల్లూరు గంగాధర్వీరాలయం, భైరవకోన ఇలా అన్ని దేవాలయాల్లో శివకేశవారాధనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్థానిక ప్రజలు, ప్రముఖులు అంతా ఆలయాలకు వచ్చి ఆ మహాదేవునికి పూజలు చేసుకున్నారు. నెల్లూరు నగరంలోని శ్రీ మూలస్థానేశ్వరాలయం, శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయం, నవాబుపేట శివాలయం, చెరువు ఒడ్డున ఉన్న గణేష్‌ఘాట్‌ల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ఆ పరమేశ్వరునికి ప్రణమిల్లారు.

# దోర్నాల హరిబాబుకు.. 'విశ్వజనని' అవార్డు



నెల్లూరుకు చెందిన నటుడు, రంగస్థలరంగంలనూ సినీరంగంలోనూ తనదంటూ ప్రత్యేక సంభాషణా చాతుర్యంతో రాణిస్తున్న కళాకారుడు దోర్నాల హరిబాబుకి హైదరాబాద్‌లో ఇటీవల 'విశ్వజనని ఫౌండేషన్' వారు ఉత్తమ హాస్యనటుడుగా అవార్డునిచ్చి ఘనంగా సన్మానించారు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రతిభావంతులైన కళాకారులకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక అవార్డును ఆయన ప్రముఖ సినీ హాస్యనటులు గౌతమ్ రాజు నుంచి అందుకున్నారు. కొద్ది నెలల క్రితమే హరిబాబు రాష్ట్రప్రభుత్వం అందజేసే 'కళారత్న' పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా అందుకున్న విషయం తెలిసిందే. నెల్లూరులో తొలుత పౌరాణిక నాటకరంగంలో బాలనటునిగా తన ప్రస్థానం ఆరంభించిన హరిబాబు, ఆ తర్వాత సాంఘిక నాటకాల్లో పలు హాస్యపాత్రల్లో బాగా రాణించారు. గత మూడు దశాబ్దాలుగా నటనా రంగంలో అద్వితీయమైన కృషిచేస్తూ, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలను అందుకుని నెల్లూరుకు ఘనకీర్తి తెచ్చారు. దేశవిదేశాల్లో ఎన్నో హాస్యరస ప్రధానమైన ప్రదర్శనలిస్తూ, అందరినీ నవ్విస్తూ ప్రముఖుల నుంచి ఎన్నో అవార్డులు-సన్మానాలు పొందారు. తనే స్వయంగా 'హరివిల్లు క్రియేషన్స్' సంస్థను ఏర్పాటుచేసి ఎందరో కళాకారుల్ని, సాహితీవేత్తల్ని సన్మానిస్తూ, పేదకళాకారులకి తనవంతు సాయం అందిస్తూ ఎంతోకాలంగా కళాకారులకు ఆత్మీయనేస్తంగా ఉంటున్నారాయన. మాటల్తే నవ్వులుగా మార్చి, నెల్లూరు యాస భాషలతో అందరినీ తన నటనాప్రతిభతో ఆనందతరంగితుల్ని చేస్తున్న హరిబాబుకి తాజాగా విశ్వజనని అవార్డు రావడం పట్ల స్థానిక కళాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## కాలధర్మం
# పేరం వెంకయ్య



విశ్రాంత ఐ.పి.ఎస్ అధికారి, మాజీ డీజీపీ పేరం వెంకయ్య నవంబరు 1వతేదీ శనివారం హైదరాబాద్‌లోని తమ స్వగృహంలో కన్ను మూశారు. ఆయన వయస్సు 89 సంవత్స రాలు. వెంకయ్య స్వస్థలం నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం వల్లూరు గ్రామం. 1936 డిసెంబర్ 4న లక్ష్మయ్య, అచ్చమ్మ దంపతులకు ఆయన జన్మించారు. ఆ దంపతులకి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. కుమారులలో పెద్దవాడు పెద వెంకట నరసయ్య కాగా రెండవవాడు పేరం వెంకయ్య. అన్న నరసయ్య మార్గదర్శకత్వంలో పెరిగి పెద్దవాడై, ఉన్నత విద్యా వంతుడైన వెంకయ్య తొలుత న్యాయవాద వృత్తిని చేపట్టి ఆ తరువాత 1963లో ఐ.పీ.ఎస్.కి ఎంపికయ్యారు.

ఉమ్మడి రాష్ట్రంలో నిజామాబాద్, చిత్తూరు, అనంతపురం, ఖమ్మం, మెదక్ జిల్లాలలో పోలీసుశాఖలో వివిధ హోదాలలో పనిచేశారు. విశాఖ నుంచి విడిపోయి విజయనగరం ప్రత్యేక జిల్లాగా ఏర్పడినప్పుడు వెంకయ్య కొత్త విజయనగరం జిల్లాకు మొట్టమొదటి ఎస్.పి.గా పనిచేయడం విశేషం. మెదక్ ఎస్.పీగా పనిచేసే తరుణంలో పోలీస్ ఎన్‌కౌంటర్లని ఆపడానికి ఆయన శతవిధాలా ప్రయత్నం చేశారు. చీఫ్ కంట్రోలర్ ఆఫ్ వెయిట్స్ & మెషర్స్ అధికారిగా పనిచేసే తరుణంలో అనేకమంది ఉద్యోగులకి పదోన్నతులు కల్పించి ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే అధికారిగా ఖ్యాతి గడించారు. 1999లో అడిషనల్ డీజీపీ(లా అండ్ ఆర్డర్) హోదాలో పదవీ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ అనంతరం తరచూ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు.

వెంకయ్యకి భార్య ఇందిరాదేవి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు, సురేష్‌బాబు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కెనడాలో స్థిరపడ్డాడు. రెండవ కుమారుడు డాక్టర్ లక్ష్మీపతి పీడియాట్రిక్ సర్జన్. ఆయన కూడా తొలుత ఐపీఎస్‌కి ఎంపికయ్యాడు. అయితే, ఆ సర్వీస్‌కు స్వస్తి చెప్పి, ప్రస్తుతం వెస్టిండీస్‌లో డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. కుమార్తెలు రాధిక మహారాష్ట్ర క్యాడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆమె భర్త అదే రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ అధికారి వికాస్ చంద్రరస్తోగి, రెండవ కుమార్తె సమత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా బెంగళూరులో పని చేస్తున్నారు.

వెంకయ్య అన్న పెద వెంకట నరసయ్య కుమారుడు ప్రొఫెసర్ పేరం వెంకటరత్నం కంటి వైద్య నిపుణుడిగా నెల్లూరీయులకి కూడా చిరపరిచితులే. ఆయన గతంలో నెల్లూరులోని అమెరికన్ ఆసుపత్రిలో కంటివైద్య విభాగంలో పనిచేసేవారు. ఆ తరువాత కొన్నాళ్ళు వికాస్ కంటి ఆసుపత్రి పేరుతో సొంతంగా క్లినిక్ కూడా నిర్వహించారు. ప్రస్తుతం హైదరాబాదులో సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో నేత్ర వైద్య విభాగానికి అధిపతిగా ఖ్యాతి గడించి తన సేవలందిస్తున్నారు. వెంకయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.



## వెంకటాచలం వద్ద..
# మెగా ఉచిత నేత్రవైద్య శిబిరం

సర్వేపల్లి సమీపంలోని వెంకటాచలం టోల్ ప్లాజా వద్దనున్న స్వాతి ఫార్మసీ కళాశాలలో ఇటీవల మెగా ఉచిత నేత్ర శస్త్రచికిత్సా శిబిరం నిర్వహించారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఈ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు. ఇక్కడ చెన్నైకి చెందిన ప్రముఖ నేత్ర వైద్యసంస్థ శంకరనేత్రాలయం ఆధ్వర్యంలో ఉచితంగా నేత్ర వైద్యసేవలు అందించడం అభినంద నీయం. చెన్నై నుంచి వచ్చిన నేత్ర వైద్యులు ప్రజలకు ఉచితంగా సేవలందిస్తున్నారని, పది రోజుల పాటు ఈ నేత్ర వైద్యశిబిరం కొనసాగుతుందని, మొదట కంటి పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తారని, ఈ సదవకాశాన్ని కంటిరోగులు సద్వినియోగం చేసుకోవాలని సోమిరెడ్డి కోరారు. ప్రత్యేక వసతులు కలిగిన మొబైల్ సర్జికల్ యూనిట్‌లో ఇక్కడే శస్త్రచికిత్సలు చేయడం సంతోషకరమన్నారు. ఈ నేత్ర వైద్యశిబిరం కార్యక్రమం చేపట్టిన స్వాతి కళాశాల యాజమాన్యానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రహదారి పనులను పరిశీలించిన గిరిధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కందమూరు గ్రామం నుండి ఉప్పుటూరు గ్రామం వరకు 2.65కోట్ల రూపాయల వ్యయంతో జరుగుతున్న ప్రధాన రహదారి పనులును ఇటీవల టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏడాదిలోనే నెల్లూరురూరల్ నియోజకవర్గంలో ప్రధాన రహదారులను దాదాపు 70కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేశామని చెప్పారు. రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తాం

విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తామని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నాసర్ చెప్పారు. సమస్యలు తీర్చాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బస్సుయాత్రలో భాగంగా ఈనెల 3న నెల్లూరులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఎన్నో హామీలిచ్చిన నాయకులు, అధికారం లోకి వచ్చాక విస్మరించడం అన్యాయమన్నారు. ఇకనైనా వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్ల అధ్వాన్నంగా ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నార్త్‌రాజుపాళెంలో సీఐటీయు కార్యాలయం

కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెంలోని బుచ్చి బస్టాండ్ వద్ద ఈనెల 3న ప్రజావైద్యశాల వైద్యుడు బాబూరావు ఆధ్వర్యంలో సీఐటీయు కార్యాలయాన్ని ప్రారంభించారు. సీఐటీయు-సీపీఎం నాయకులు తలారి నరసింహులు, నున్నా సురేష్, గోనె దయాకర్, దేవానందం, కాంతారావు, శివయ్య, పరశురాం, బాలకృష్ణ, శ్రీనివాసులు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

## టూకీగా...



### ముదివర్తిపాళెంలో పౌరహక్కులపై అవగాహన

ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెంలో ఇటీవల పౌరహక్కుల దినం పాటించారు. పౌరహక్కులపై ఎస్సీ,ఎస్టీలకు తహశీల్దార్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కలిగించారు. తమ హక్కులకు భంగం కలిగితే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కొండలరావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### దంపూరులో రైతులకు యూరియా కార్డులు

యూరియా ఎరువుకి కొదవ లేదంటూ ఇటీవల విడవలూరు మండలం దంపూరు గ్రామంలోని రైతులకు వ్యవసాయాధికారులు యూరియా కార్డులు అందజేశారు. ప్రతిరైతుకీ వీటిని అందజేస్తున్నామన్నారు. యూరియాను క్రమ పద్ధతిలో మాత్రమే వాడుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారిణి శ్రీలక్ష్మి, ఏఈఓ కవిత పాల్గొని రైతులకు యూరియా కార్డులు పంపిణీచేశారు.

### మల్లూరులో రక్తదాన శిబిరం

ముత్తుకూరు మండలంలోని మల్లూరు గ్రామ సచివాలయం వద్ద ఇటీవల సామాజిక సేవా కార్యకర్త పొన్నూరు లక్ష్మీ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం వారు పాల్గొని, దాతల నుంచి రక్తం సేకరించారు. రక్తదాన మోటివేటర్ సాయిరామ్, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

### జువ్వలదిన్నెలో చేపల వేటకు వెళ్లి జాలరి మృతి

జువ్వలదిన్నె హార్బర్‌లో ఇటీవల చేపల వేటకు వెళ్ళి, బోటు నుంచి ప్రమాదవశాత్తూ సముద్రంలోకి జారిపడి పెదరామడిపాళెం గ్రామానికి చెందిన కాటంగారి బ్రహ్మయ్య అనే జాలరి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి, మెరైన్ ఎస్ఐ జానకిరామ్‌రెడ్డి సంఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

### కొండబిట్రగుంటలో శ్రీవారి నగర సంకీర్తన

బోగోలు మండలం కొండబిట్రగుంటలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్థానిక సమరసత ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీవారి నగరసంకీర్తన నిర్వ హించారు. 'ఓం నమో వేంకటేశాయ' అంటూ శ్రీవారి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. పలు ప్రాంతాల నుంచి పీఠాధిపతులు పాల్గొని స్వామివారి విశిష్టతను భక్తులకు తెలియజెప్పారు.

### నార్త్‌రాజుపాళెంలో వరద బాధితులకు సాయం

కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెంలోని పునరావాస కేంద్రంలో ఉన్న తుఫాన్ బాధితులకు ప్రభుత్వ ఆదేశాలతో ఇటీవల తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లునాయుడు, ఎంపీడీఓ సుబ్బారావు తదితరులు పాల్గొని, బాధితులకు అండగా తామున్నామంటూ వారు భరోసా ఇచ్చారు.

### ముత్తుకూరులో ఎరువుల దుకాణాలు తనిఖీ

ముత్తుకూరు మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఇటీవల ఇందుకూరుపేట సబ్‌డివిజన్ వ్యవసాయ అధికారులు రఘునాథరెడ్డి తదితరులు తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. అధికధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. మండల వ్యవసాయశాఖ అధికారిణి జ్యోత్స్నరాణి, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

### కావలిలో 30న గంధమహోత్సవం

కావలి పట్టణంలో ప్రసిద్ధమైన శ్రీ నాగూరు మీరాస్వాముల వారి గంధమహోత్సవం ఈనెల 30న వైభవోపేతంగా జరుగనుంది. ఆమేరకు వాల్‌పోస్టర్లను కావలి ఎమ్మెల్యే దీవి కృష్ణారెడ్డి ఈనెల 2న టీడీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. గంధమహోత్సవానికి ముస్లిం సోదరులు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# నింగికెగసిన ఎల్‌వీఎం3-ఎం5


## ● భారత భూభాగం నుంచి తొలిసారిగా అతి భారీ ఉపగ్రహం



## ● దిగ్విజయంగా రాకెట్ ప్రయోగం

**భా**రత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన సీఎం ఎస్-03 ఉపగ్రహ ప్రయోగం దిగ్విజయమైంది. దీంతో అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో మరో ముందడుగు వేసినట్లయింది. బాహుబలి రాకెట్‌గా పేరొందిన ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా సీఎం ఎస్-03 ఉపగ్రహాన్ని మన శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రయోగించారు. శ్రీహరికోటలోని షార్‌లో ఉన్న రెండో ప్రయోగ వేదిక మీద నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు రాకెట్ రివ్వుమంటూ నింగిలోకి దూసుకుపోయింది. 5.42 గంటలకల్లా ఆ ఉపగ్రహాన్ని సిక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. భారత నౌకాదళం కోసం చేపట్టిన ఈ ప్రయోగ విజయం ఇస్రోకి గర్వకారణం. 4410 కిలోల బరువైన మల్టీ బ్రాండ్ కమ్యూనికేషన్ శాటిలైట్ సీఎంఎస్-3తో బాహుబలి రాకెట్ దిగ్విజయంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరిపోయింది. ఇది ఇస్రో నుంచి 103వ ప్రయోగం కావడం విశేషం. అంతేకాదు, భారత భూభాగం నుంచి ఇస్రో ప్రయోగించిన అతిపెద్ద సమాచార ఉపగ్రహం కూడా ఇదే.

ఈ రాకెట్ ప్రయోగం ద్వారా సుమారు పదిహేనేళ్లపాటు సమాచార సేవలు అందుకోవచ్చు. ఇంటర్నెట్ కనెక్టివిటీ, డీటీహెచ్ ప్రసారాల్లోనూ మరింత మెరుగైన సేవలందుకోవచ్చు. సమాచారంతో పాటు సముద్ర వాతావరణ పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుందని ఇస్రో ఛైర్మన్ కె.నారాయణన్ తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ఒకే రాకెట్ ద్వారా బహుళ కక్ష్యలోకి అనేక ఉపగ్రహాలను పంపించేందుకు మార్గం ఏర్పడిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే 5నెలల్లో మరో 7 ప్రయోగాలు చేసేందుకు సిద్ధమవుతున్నామని, డిసెంబర్ చివరలో జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగానికి శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఏదేమైనా, అంతరిక్ష ప్రయోగాల్లో తనదంటూ ప్రత్యేకతతో రాకెట్‌స్పీడ్‌తో దూసుకుపోతున్న ఇస్రో ఆ ప్రయోగాలన్నిటినీ విజయవంతంగా నిర్వహిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com